సోమవారం
06-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 343
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అంతరిక్ష కేంద్రం నిర్మాణంలో చైనా ముందడుగు

భూమిపైనే కాదు... అంతరిక్షంలోనూ అత్యున్నత శిఖరాలకు చైనా దూసుకుపోతోంది. తమ దేశానికంటూ ఒక ప్రత్యేక అంతరిక్ష కేంద్రం (స్పేస్ స్టేషన్) ఉండాలని ఆకాంక్షిస్తున్న చైనా... దాని నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా పురోగమిస్తోంది.

2 లో

(1914-1994)

భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులు, భూపోరాట యోధులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 108వ జయంతి నేడు

ప్రత్యేక వ్యాసం 8లో

ఉద్యోగులు లబోదిబో!

- పీఎఫ్, జీఎల్ఐ రుణాలు జాప్యం
- నెలల తరబడి పడిగాపులు
- పదవీవిరమణ చెల్లింపుల్లోనూ నిర్లక్ష్యం
- పిల్లల చదువులు, వివాహాలకు అంతరాయం
- వైద్యసేవలూ అంతంతమాత్రమే
- ఆందోళనలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు

(ఫైల్)

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉద్యోగులు దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) నుంచి రుణాల కోసం చేసిన దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండిపోయాయి. ఉపాధ్యాయ/ఉద్యోగులకు పీఎఫ్ రుణం రావాలంటే దాదాపు ఆరు నుంచి తొమ్మిది నెలల సమయం పడుతుండటంతో వారి అవసరాలకు అందిరాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇతర అత్యవసరాల కోసం పెట్టుకున్న రుణ దరఖాస్తులను సైతం ప్రభుత్వం పక్కన పడేయడంతో తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో 20 నుంచి నెల రోజులకు దరఖాస్తు దారులకు పీఎఫ్ రుణాలు మంజూరు కాగా, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏపీ జీఎల్ఐ రుణాల దరఖాస్తులు పెద్దఎత్తున ఫైళ్లకే పరిమితమవుతున్నాయి. రుణాలు కోరిన ఉద్యోగులకు సకాలంలో ఇవ్వడం లేదు. పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తుది చెల్లింపుల్లోనూ జాప్యం నెలకొంది. కనీసం ఏడాదిపాటు వారికి సమయం పడుతుండటంతో వారి పిల్లల విద్యావసరాలు, వివాహాలకు అవి అక్కరకు రావడం లేదు. బయట వడ్డీలకు అప్పులు తెచ్చి ఆర్థికంగా చితికిపోతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం, ఉద్యోగుల పక్షపాతినంటూనే వారి ప్రయోజనాలను కాలరాస్తోంది. రాష్ట్రంలోని సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రధాన భూమిక వహిస్తున్నారు. అమ్మఒడి, నాడు-నేడు పథకాలతో ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది. నిత్యం యాప్‌లలో సమాచారం జోడించే పనిలో నిమగ్నమవుతున్నారు. ఇంత చేసినా, వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించలేక పోతోంది. ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐపై ఇచ్చే రుణాలను సైతం సకాలంలో ఇవ్వకపోడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇక పీఆర్సీ ఫిట్‌మెంట్‌ను ప్రభుత్వం సక్రమంగా అమలు చేయనందున, వారికి నష్టం వాటిల్లింది.

అలంకారప్రాయంగా హెల్త్‌కార్డులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం కేటాయించిన వైఎస్ఆర్ హెల్త్ కార్డులు అలంకార ప్రాయంగా మారాయి. వాటిని అన్ని కార్పొరేట్/ప్రైవేట్

- మిగతా 2 లో

ఫార్మా... బిక్కుబిక్కు

- బ్రాండిక్స్‌లో తరచూ ప్రమాదాలు
- తాజాగా మరో పరిశ్రమ నుంచి గ్యాస్ లీక్
- భద్రతా ప్రమాణాలు గాలికి
- పరిశ్రమల యాజమాన్యాల అలసత్వం
- తీవ్ర ఆందోళనలో ఉద్యోగులు, స్థానిక ప్రజలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో గల బ్రాండిక్స్‌లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అంతు పట్టడం లేదు. ఆదివారం తాజాగా ఓ పరిశ్రమ నుంచి గ్యాస్ లీక్ కావడంతో మళ్లీ ఉద్యోగులు, స్థానికుల్లో ఆందోళన నెలకొంది. సీడ్స్ వస్త్ర పరిశ్రమలో వందలాది మంది మహిళా ఉద్యోగులు విషవాయువుల కారణంగా అస్వస్థతకు గురికావడానికి గల కారణాలను గుర్తించడంలో అధికారులు ఇంకా తలమునకలై ఉన్నారు. విషవాయువులు ఎక్కడి నుంచి వెలువడ్డాయో మూడు రోజులు కావస్తున్నా అధికారులు గుర్తించకపోవడం విడ్డూరం. ప్రమాదం జరిగిన వెంటనే కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సమీపంలో ఉన్న సీడ్స్ పరిశ్రమ నుంచి అమ్మోనియా వెలువడిందని నిర్ధారించారు. 180 వరకు రసాయన పరిశ్రమలు ఉన్న ఈ సెజ్‌లో ఏ పరిశ్రమ నుంచి ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగులు, స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో ఉన్న సీడ్స్ వస్త్ర పరిశ్రమను తాత్కాలికంగా మూసివేశారు. నిపుణుల కమిటీ నివేదిక వచ్చిన తర్వాత మళ్లీ పరిశ్రమను తెరవాలని నిర్ణయించినప్పటికీ ఆదివారం బ్రాండిక్స్ సమీపంలో మళ్లీ గ్యాస్ లీక్ కావడంతో ఉద్యోగులు, పరిసర ప్రాంత గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బ్రాండిక్స్‌లో సీడ్స్ పరిశ్రమలో

- మిగతా 2 లో

ఢాకాలో ఘోర అగ్నిప్రమాదం

40 మంది మృతి

వందలమందికి తీవ్ర గాయాలు

2 లో

'సర్జికల్ స్ట్రైక్స్' దేశానికి నష్టం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ, పక్కన జల్లి విల్సన్, వనజ, రవీంద్రనాథ్

- జాతికి మోదీ క్షమాపణ చెప్పాలి
- అరెస్సెస్, బీజేపీ ఖాతాల్లోకి బ్లాక్‌మనీ
- అదానీకి లబ్ధికోసమే బొగ్గు కొరత
- మోదీ ఎదుట మోకరిల్లుతున్న జగన్
- వైసీపీ బ్లాక్ మెయిలింగ్‌కు బెదరబోం
- సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సర్జికల్ స్ట్రైక్స్‌తో దేశానికి జరిగిన నష్టంపై ప్రధాని మోదీ జాతికి సమాధానం చెప్పాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్‌తో డ్రగ్ మాఫియా ఆగిందా?, ఉగ్రవాదం ఏ మాత్రమైనా తగ్గిందా? అని ప్రశ్నించారు. మోదీ విధానాలపైన, జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. మోదీ పాలనలో సామాన్యులే ఎక్కువగా

- మిగతా 2 లో

నేడు 'పది' పరీక్షా ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పదో తరగతి పరీక్షా ఫలితాలను సోమవారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేయనున్నారు. ఈనెల 4వ తేదీ శనివారం ఈ పరీక్షలను విడుదలకు సర్వం సిద్ధమవ్వగా, సాంకేతిక కారణాల రీత్యా వాటిని వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఆ రోజు ఫలితాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురు చూసి, తీవ్ర నిరాశకు గురయ్యారు. అధికారులు, మంత్రి బొత్స సత్యనారాయణ మధ్య సమన్వయం లేనందునే, సీఎం కార్యాలయ అధికారుల ఆదేశాలతో ఫలితాలను వాయిదా వేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంతో ప్రభుత్వం మరోమారు అభాసుపాలైంది. ఫలితాల తేదీ నిర్ణయించే ముందే, అన్నీ సరిచూసుకోవాల్సిందిపోయి, తేదీ ప్రకటించాక వాయిదా వేయడాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పుబట్టారు. ఫలితాల వాయిదా వెనుక

- మిగతా 2 లో

వర్షాల రాకే ఆలస్యం

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : ఖరీఫ్ సీజన్ మొదలైంది. అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తొలకరి కోసం కోటి ఆశలతో రైతన్న సన్నద్ధమవుతున్నాడు. ఆరుగాలం శ్రమ ఫలిస్తుందని అరకతో కదులుతున్నాడు. గత గుణపాఠాలను పరిగణలోకి తీసుకుని ముందుకు సాగుతున్నాడు... అయినా సవాలక్ష సమస్యలు...గత రుణాలు మాఫీకాకున్నా... కొత్తగా అప్పులు చేయాలి. ఇవన్నీ కర్షకుని ముందున్న సవాళ్లు. వీటన్నింటినీ తట్టుకుని మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు.

నాడు.. పండగలా సాగిన వ్యవసాయం నేడు కష్టాల మయంగా మారింది. కొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ మొదలు కానుంది. పంటల సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. నాణ్యమైన విత్తనాలు సక్రమంగా అందుతాయో లేదోనన్న

సాగుకు సర్వం సిద్ధం

ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. భూసార పరీక్షలు చేయకపోవడంతో ఏ మేరకు ఎరువులు వాడాలో అర్థం కాని పరిస్థితి. బ్యాంకులు రైతుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో పెట్టుబడి ఖర్చుల కోసం దిక్కులు చూడాల్సిన దుస్థితి ఉంది. మరోవైపు వరుణుడు కరుణిస్తాడో లేదోనన్న భయం వెంటాడుతోంది. అనేక సమస్యల మధ్య అన్నదాత మరోసారి వ్యవసాయ జూదంలో అడుగుపెడుతున్నాడు. పంటల సాగుకు అన్నదాతలు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేస్తున్నారు. తొలకరి జల్లులు కురవగానే సాగు ఆరంభించేందుకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మళ్లీ కోవిడ్ విజృంభణ

దేశంలో 4,270 కొత్త కేసులు

ఒక శాతం దాటిన పాజిటివిటీ రేటు

న్యూదిల్లీ : దేశంలో మళ్లీ కరోనా మహమ్మారి విజృంభిస్తోంది. గత 10 రోజులుగా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో కొత్తగా 4,270 కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 4,31,76,817కి పెరిగింది. 34 రోజుల తర్వాత రోజువారీ పాజిటివిటీ రేటు ఒక శాతం దాటినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆదివారం ఉదయం 8 గంటల వరకు అందిన వివరాల ప్రకారం, క్రియాశీల కేసులు 24,052కి పెరగగా, తాజాగా మరో 15 మందితో మొత్తం మృతుల సంఖ్య 5,24,692కి చేరింది. మొత్తం ఇన్ఫెక్షన్లలో క్రియాశీల కేసులు 0.06 శాతంగా ఉన్నాయి. అయితే జాతీయ కోవిడ్ రికవరీ రేటు 98.73 శాతంగా ఉన్నట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. రోజువారీ పాజిటివిటీ రేటు 1.03 శాతంగా నమోదు కాగా, వారపు పాజిటివిటీ రేటు 0.84 శాతంగా ఉంది. మే 1న రోజువారీ పాజిటివిటీ రేటు 1.07 శాతంగా నమోదయింది. గత మూడు నెలల్లో దేశంలో కరోనా కేసుల సంఖ్యలో గణనీయమైన తగ్గుదల నమోదయింది. అయినప్పటికీ గత వారం నుంచి కేసులలో పెరుగుదల కనిపించడం ఆందోళన

- మిగతా 2 లో

రైల్వేకు 'బొగ్గు' దెబ్బ...!

- ఈ ఏడాది దాదాపు 9 వేల రైలు సర్వీసుల రద్దు
- బొగ్గు తరలింపు కారణంగా 1,900 సర్వీసులు
- నిర్వహణ, నిర్మాణ పనులకు ప్రాధాన్యత

న్యూదిల్లీ : రైళ్లలో కొరత, గత కొన్నేళ్లుగా టికెట్ల డిమాండ్‌లో తీవ్ర పెరుగుదల, కొత్త రైళ్లు లేకపోవడం వంటి కారణాలతో ప్రయాణికులకు నిర్ధారణ చేసిన టికెట్లను అందించడంలో రైల్వేలు ఇబ్బంది పడుతున్నాయి. రైల్వే శాఖ ఈ ఏడాది దాదాపు 9 వేల రైలు సర్వీసులను రద్దు చేసింది. అందులో 1,900కు పైగా రైలు సర్వీసులు గత మూడు నెలల్లో బొగ్గు తరలింపు కారణంగా రద్దయ్యాయని ఆర్టీఐ ప్రశ్నలో తేలింది. చంద్ర శేఖర్ గౌర్ అనే వ్యక్తి సమాచార హక్కు (ఆర్టీఐ) కింద దాఖలు చేసిన ఒక ప్రశ్నకు సమాధానంగా, రైల్వే నిర్వహణ పనుల కోసం లేదా నిర్మాణ ప్రయోజనాల కోసం 6,995 రైలు సర్వీసులను రద్దు చేసినట్లు తెలిపింది. అయితే బొగ్గు సంక్షోభం కారణంగా మార్చి నుంచి మే వరకు 1,934 సర్వీసులను రైల్వే శాఖ రద్దు చేసింది. తీవ్ర విద్యుత్ కొరత కారణంగా

- మిగతా 2 లో

అంతరిక్ష కేంద్రం నిర్మాణంలో చైనా ముందడుగు

నింగిలోకి ముగ్గురు వ్యోమగాములు

బీజింగ్: భూమిపైనే కాదు... అంతరిక్షంలోనూ అత్యున్నత శిఖరాలకు చైనా దూసుకుపోతోంది. తమ దేశానికంటూ ఒక ప్రత్యేక అంతరిక్ష కేంద్రం (స్పేస్ స్టేషన్) ఉండాలని ఆకాంక్షిస్తున్న చైనా... దాని నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా పురోగమిస్తోంది. 'టియాన్ గాంగ్' (టియాన్ హీ) పేరుతో నిర్మిస్తున్న అంతరిక్ష కేంద్రం నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ఆదివారం ముగ్గురు వ్యోమగాములను అక్కడికి పంపించింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10.44 గంటలకు 'లాంగ్ మార్చ్ 2ఎఫ్' రాకెట్ ద్వారా ముగ్గురు వ్యోమ గాములతో కూడిన 'షెన్ ఝౌ 14' వ్యోమనౌకను గగనతల కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమాన్ని చైనా మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేశారు.

6 నెలల పాటు అంతరిక్షంలోనే...

చైనా వ్యోమగాములు కమాండర్ చెన్ డాంగ్, ఇతర జట్టు సభ్యులు లియు యాంగ్, కైజుజెలను అంతరిక్షంలోకి వెళ్లారు. డిసెంబర్‌లో వీరంతా తిరిగి వస్తారు. ఈ ఆరు నెలల కాలంలో అంతరిక్ష కేంద్రంలో నివసిస్తూ.. దాని నిర్మాణానికి కృషి చేస్తారు. ఇప్పటికే టియాన్ గాంగ్ స్పేస్ స్టేషన్ కక్ష్యలో ఉన్న మరో ముగ్గురు వ్యోమగాములను ఈ ముగ్గురు వెళ్లి కలుసుకుంటారు. . 'వెంతియాన్', 'మెంగ్ తియాన్' అనే రెండు లేబొరేటరీ మాడ్యూల్స్ ఏర్పాటులో వీరు కీలక పాత్ర పోషించనున్నారు. లేబొరేటరీ మాడ్యూల్స్ అంటే... వ్యోమగాములు నివసించే గృహాల సముదాయం. 'తియాన్హె' పేరుతో మొదటి మాడ్యూల్ నిర్మాణం ఇప్పటికే పూర్తవడంతో దాన్ని ప్రారంభించారు. జులై లో 'వెంతియాన్' మాడ్యూల్ ను, అక్టోబరులో 'మెంగ్ తియాన్' మాడ్యూల్ ను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. గతేడాది మొదలైన ఈ స్పేస్ స్టేషన్ నిర్మాణ పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలనే కృత నిశ్చయంతో చైనా ఉంది. 'టియాన్ గాంగ్' స్పేస్ స్టేషన్ 6 బెడ్ రూమ్‌ల ఇంటి కంటే కొంచెం పెద్ద సైజులో ఉంటుంది. ఈ ఏడాది చివరికల్లా మొత్తం అంతరిక్ష కేంద్రం నిర్మాణాన్ని పూర్తిచేయాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. ముందుగా వెళ్లిన ముగ్గురు వ్యోమగాములు అక్కడ కీలక స్పేస్ టెక్నాలజీల పనితీరును పునఃపరీక్షించారు. రష్యా సాయంతో నిర్మితమైన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) భవిష్యత్‌లో నిర్వీర్యమైతే చైనా స్పేస్ స్టేషన్(సీఎస్ఎస్) ఒక్కటే మానవనిర్మిత కేంద్రంగా రికార్డులకెక్కనుంది. ఈ ఏడాది మొత్తంగా సీఎస్ఎస్‌కు 140 ఉపకరణాలు పంపేందుకు 50 అంతరిక్ష ప్రయోగాలు చైనా చేపట్టనుంది.

ఢాకాలో ఘోర అగ్నిప్రమాదం...40 మంది మృతి

వందలమందికి తీవ్ర గాయాలు

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ప్రైవేటు కంటైనర్ డిపోలో జరిగిన ఈ ప్రమాదంలో 40మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 450 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. శనివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. పేలుడు ధాటికి స్థానికంగా ప్రకంపనలు వచ్చాయి. సమీపంలోని భవనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. మంటలను ఆర్పేందుకు 19 ఫైర్ఇంజిన్లు రంగంలోకి దిగాయి. ఆరు అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. చిట్టాగాంగ్‌లోని సీతాకుండా ఉపజిలాజిలా ప్రాంతంలో ఉన్న బీఎం కంటైనర్ డిపోలో ఈ ప్రమాదం సంభవించిందని స్థానిక ఎస్ఐ నురుల్ ఆలం తెలిపారు. రాత్రి 9 గంటలకే మంటలు ప్రారంభం కాగా 11.45 గంటల సమయంలో భారీ పేలుడు సంభవించిందని, ఆ తర్వాత మంటలు ఒక కంటైనర్ నుంచి మరో కంటైనర్‌కు వ్యాపించగా, ఓ కంటైనర్‌లో రసాయనాలు ఉండటం వల్ల మంటలు భారీగా చెలరేగినట్లు ఆయన వివరించారు. డిపో చాలా వరకు ఖాళీగానే ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అగ్నిప్రమాదంలో 450 మందికి పైగా గాయపడ్డారని రెడ్ క్రిసెంట్ యూత్ హెల్త్ సర్వీస్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఇస్తాకుల్ ఇస్లామ్ పేర్కొన్నారు. 350 మంది స్థానిక సీఎంసీఎహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ఇతర ఆస్పత్రుల్లో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ ఘటనపై బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సహాయక చర్యల కోసం అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అగ్నిప్రమాద ఘటనపై అధికారులు అత్యున్నత స్థాయి విచారణ ప్రారంభించారు. మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించనున్నారు. మరోవైపు, మృతుల కుటుంబ సభ్యులకు 560 డాలర్ల పరిహారా (సుమారు రూ.43వేలు)న్ని చట్టోగ్రామ్ డివిజనల్ కమిషనర్ అష్రఫ్ ఉద్దిన్ ప్రకటించారు. గాయపడ్డ వారికి 224 డాలర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

విశాలాంధ్ర ప్రపంచం

పేలుళ్లతో దద్దరిల్లిన కీవ్

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్ ఆదివారం పేలుళ్లతో దద్దరిల్లింది. దాదాపు కొన్ని వారాల వ్యవధి తర్వాత ఈ స్థాయి దాడిని కీవ్ చవిచూసింది. దీంతో నగరంలోని పలు భవనాల నుంచి నల్లటి పొగ వెలువడుతోంది. ఈ దాడుల్లో కనీసం ఒకరు గాయపడినట్లు ప్రాథమిక వార్తలతో తెలుస్తోంది. మరోపక్క డాన్‌బాస్ ప్రాంతంలోని సెవీరోడొనెట్స్క్ నగరంలో హోరాహోరీ పోరాటం జరుగుతోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ ఆ నగరంలో పరిస్థితి అత్యంత సంక్లిష్టంగా ఉందని పేర్కొన్నారు. లుహాన్స్క్ ప్రాంతం చాలా వరకు రష్యా దళాలు, స్థానిక వేర్పాటువాద దళాల స్వాధీనంలోకి వెళ్లిపోయింది. దీంతో సెవీరోడొనెట్స్క్, ఇతర నగరాల్లో రష్యా బలగాలు నిరంతరాయం దాడులు యుద్ధవిమానాలు, శతఘ్నులతో దాడులు చేస్తూనే ఉన్నాయి. అయినా కానీ ఉక్రెయిన్ దళాలు కొన్ని చోట్ల మొండిగా పోరాడుతున్నాయని జెలెన్‌స్కీ వెల్లడించారు. పశ్చిమ దేశాలు అందించే అత్యాధునిక ఆయుధాల కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. మరోపక్క ఉక్రెయిన్ ఇతర ప్రాంతాల నుంచి సరఫరాలు డాన్‌బాస్ ప్రాంతానికి చేరకుండా రష్యా బలగాలు కీలక వంతెనలు పేల్చేశాయి. తాజాగా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ప్రజల జీవనం సాధారణ స్థాయికి వచ్చిన తర్వాత ఈ దాడులు మళ్లీ జరగడం విశేషం. కానీ, ఆదివారం ఉదయం అక్కడి ప్రజలు నిద్రలేచే సమయానికి నగరం మొత్తం నల్లటి పొగకమ్ముకొని ఉంది. ఆ నగరం ఇప్పటికీ యుద్ధం అంచున ఉందన్న విషయాన్ని వారికి గుర్తు చేసింది. తూర్పు ఐరోపా దేశాలు సరఫరా చేస్తున్న ట్యాంకులను లక్ష్యంగా చేసుకొని రష్యా అత్యంత కచ్చితత్వంతో ఈ క్షిపణుల దాడి చేసినట్లు ఉక్రెయిన్ రక్షణశాఖ వెల్లడించింది.

నేడు 'పది' పరీక్షా ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు, మంత్రి బొత్స మధ్య సమన్వయ లోపమేనా? ఇంకేమైనా కారణాలున్నాయా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. ఈసారైన ఫలితాల్లో ఎలాంటి జాప్యం లేకుండా అనుకున్న సమయానికి విడుదల చేయాలని కోరుతున్నారు. విజయవాడ గేట్ వే హోటల్‌లో ఫలితాలను విద్యాశాఖాధికారులతో కలిసి మంత్రి బొత్స విడుదల చేస్తారు. వాటిని www.results.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని ఏపీ ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి తెలిపారు.

మళ్లీ కోవిడ్ విజృంభణ

(మొదటిపేజీ తరువాయి)

కలిగిస్తోంది. మే 27 చివరి నాటికి 15,708 కేసులు నమోదవగా.. జూన్ 3 నాటికి ఆ కేసుల సంఖ్య 21,055కి పైగా చేరింది. అదనంగా వారపు పాజిటివిటీ రేటు (మే 27, 2022 నుంచి జూన్ 3, 2022 మధ్య) 0.52 శాతం నుంచి 0.73 శాతానికి పెరిగింది. కేరళతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా కొత్త కేసులు నమోదవుతున్నాయి. దీంతో కరోనా మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ కేంద్రం ఈ రాష్ట్రాలకు లేఖ రాసింది. ఇదిలాఉండగా, కరోనా మహమ్మారి నుంచి ఇప్పటి వరకు 4,26,28,073 మంది కోలుకున్నారు. అయితే మరణాల రేటు 1.22 శాతంగా నమోదయింది. జాతీయ కోవిడ్-19 టీకా కార్యక్రమం కింద దేశంలో ఇప్పటి వరకు 194.09 కోట్ల మందికి పైగా టీకా డోసులు పొందారు.

మాజీ సీఎం ఫడ్నవీస్‌కు పాజిటివ్

మహారాష్ట్రలో మరోసారి కరోనా కేసులు పెరుగుతున్నాయి. అనేక మంది ప్రముఖులు కరోనా బారిన పడుతున్నారు. తాజాగా మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత దేవేంద్ర ఫడ్నవీస్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. 'నాకు కోవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. నేను హోం ఐసోలేషన్‌లో ఉన్నాను. డాక్టర్ సలహా మేరకు మందులు, చికిత్స తీసుకుంటున్నాను. ఇటీవల నన్ను కలిసినవారు కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నాను. అందరూ జాగ్రత్త వహించండి' అని ఫడ్నవీస్ పేర్కొన్నారు.

షారుఖ్, కత్రీనాలకు కరోనా పాజిటివ్

బాలీవుడ్‌లో కరోనా కలకలం రేగింది. సినీ నటులు షారుఖ్ ఖాన్, కత్రినాకైఫ్ కరోనా బారిన పడ్డారు. వీరిద్దరికి కరోనా పరీక్షలు చేయగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. గతంలో చాలా మంది సెలబ్రెటీలు కరోనా బారిన పడ్డారు.

ఉద్యోగులు లబోదిబో!

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రుల యాజమాన్యం స్వీకరించడం లేదు. దీనికి కారణం గతంలో చేసిన వాటికి మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు నిలిచిపోవడమేనని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు దాదాపు 3.50లక్షల మంది, పెన్షనర్లు మరో లక్షా 50వేల మంది ఉన్నారు. ప్రభుత్వం నుంచి మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లు సకాలంలో రావనే ఆందోళనతో, ఉద్యోగుల హెల్త్‌కార్డులపై వైద్యసేవలకు ఆస్పత్రి యాజమాన్యాలు అంగీకరించడం లేదని తెలిసింది. ఇటీవల ఏలూరుజిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయిని ముక్కుకు స్వల్పగాయమై చికిత్స కోసం ఓ కార్పొరేట్ ఆస్పత్రిని ఆశ్రయించగా... అక్కడ ఆమెకు ప్రభుత్వం జారీచేసిన హెల్త్‌కార్డుపై సేవలందలేదు. హెల్త్‌కార్డుల ద్వారా సేవలందాలంటే ముందు వారి వివరాలను వైఎస్ఆర్ హెల్త్‌కేర్ ట్రస్టుకు ఆన్‌లైన్లో పంపాలి. అక్కడ ఆమోదం పొందాక గాని వైద్యసేవలు ప్రారంభిస్తారు. అది కూడా అన్ని కార్పొరేట్/ప్రైవేట్ ఆస్పత్రుల్లో కొన సాగడం లేదు. అత్యవసరంగా వైద్యం కోసం ఆస్పత్రులను ఆశ్రయించే ఉద్యోగుల కు ఈ హెల్త్‌కార్డులపై సేవలు అందడం గగనంగా మారింది. ఆరోగ్యశ్రీకి పెద్దపీట వేస్తున్నామంటూ చెబుతున్న సీఎం జగన్, ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్‌కార్డుల ఆధారంగా తగు వైద్యం అందించలేక పోతున్నారనే విమర్శలున్నాయి.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలివీ...

ఉద్యోగ, ఉపాధ్యాయులు 71 పెండింగ్ సమస్యలతో ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. ఇందులో ఉపాధ్యాయులకు చెందిన 28 డిమాండ్లపై ఇటీవల ఉన్నతాధికారులకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, తిమ్మన్న విన్నవించినా స్పందన లేదు. ఉపాధ్యాయులకు కామన్ సర్వీస్ రూల్స్ వెంటనే ప్రకటించాలని, డీవైఈవో, జూనియర్ లెక్చరర్ల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరుతున్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని కోరుతున్నారు. మూడేళ్ల నుంచి డీఎస్సీ లేనందున, ఉపాధ్యాయ ఖాళీ స్థానాల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులను కేటాయించాలని కోరుతున్నారు. కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీరో సర్వీస్ ద్వారా బదిలీలకు అవకాశం కల్పించాలనే తదితర డిమాండ్లపై ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం మేల్కొని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, లేకుంటే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ఉద్యోగ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

ఉత్తరకొరియా దూకుడు...
అరగంటలో ఎనిమిది క్షిపణి పరీక్షలు

ప్యాంగ్‌యాంగ్: ఉత్తర కొరియా వరుస బాలిస్టిక్ క్షిపణి పరీక్షలు చేపట్టింది. కేవలం 35 నిమిషాల వ్యవధిలో ఎనిమిది స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి పరీక్షలు నిర్వహించింది. రాజధాని ప్యాంగాంగ్‌కు సమీపంలోని సునన్ ప్రాంతంలో ఈ ప్రయోగాలు చేసినట్లు తెలుస్తోంది.

ఒక్కరోజులో అత్యధిక బాలిస్టిక్ క్షిపణుల పరీక్షలు నిర్వహించడం ఇదే తొలిసారని అధికారులు చెబుతున్నారు. కాగా అమెరికాకు హెచ్చరికగానే ఉత్తరకొరియా ఈ క్షిపణి పరీక్షలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇటీవలే అమెరికా నావికా దళాలు, దక్షిణ కొరియా సైన్యంతో కలిసి ఫిలిప్పీన్స్ సముద్రంలో సంయుక్త విన్యాసాలు నిర్వహించాయి. ఇందులో అమెరికా విమాన వాహక నౌక రోనాల్డ్ రీగన్ సైతం పాల్గొంది. 2017 తర్వాత విన్యాసాల్లో ఓ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలోనే ఉత్తరకొరియా క్షిపణి పరీక్షలు నిర్వహించింది. అయితే, తాజా క్షిపణులు ఎంత దూరం ప్రయాణించాయనే విషయంపై సమాచారం లేదని దక్షిణ కొరియా అధికారులు తెలిపారు. దీనిపై చర్చించడానికి జాతీయ భద్రతా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ ఘటనపై స్పందించిన అమెరికా ఇండోపసిఫిక్ కమాండ్, అమెరికా భూభాగానికి, పౌరులకు ఎలాంటి ముప్పు లేదని పేర్కొంది. కాగా ఉత్తరకొరియా ప్రయోగాలపై జపాన్ ఆందోళన వ్యక్తం చేసింది. తాజా ప్రయోగాలపై వీలైనంత సమాచారాన్ని సేకరించాలని ప్రధాని ఫ్యుమియో కిషిదా అధికారులను ఆదేశించారు.

విమానాలు, నౌకలకు ఎలాంటి ప్రమాదం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. తాజా ప్రయోగాలు ...2022లో ఉత్తర కొరియా నిర్వహించిన 18వ క్షిపణి పరీక్షలు. ఇందులో ఖండాంతర బాలిస్టిక్ మిస్సైళ్లు కూడా ఉన్నాయి. ఉత్తర కొరియా, ఐదేళ్ల విరామం తర్వాత ఈ తరహా పరీక్షలు నిర్వహించింది.

'సర్జికల్ స్ట్రైక్స్' దేశానికి నష్టం

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులకు గురయ్యారని, కార్పొరేట్ వర్గాలకు మేలు జరిగిందన్నారు. నాడు నోట్ల రద్దుతో బ్లాక్ మనీ కాస్తా, వైట్‌గా మార్చేసుకున్నారన్నారు. 18లక్షల కోట్ల నల్లధనాన్ని మార్చేసుకున్నారనీ, 0.6మాత్రమే మార్చకుండా వృథా అయిందని వివరించారు. లక్షలాది కోట్ల రూపాయల బ్లాక్‌మనీ ఆరెస్సెస్, బీజేపీ ఖాతాల్లోకి చేరిందన్నారు. అదానీకి మేలు చేసేందుకే బొగ్గు ఉత్పత్తిని మోదీ ప్రభుత్వం కావాలని తగ్గించిందని విమర్శించారు. ఆస్ట్రేలియాలో ఆదానీకి బొగ్గు ఉత్పత్తి కేంద్రాలున్నాయనీ, జలమార్గం మొత్తం ఆయన వశమైందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు చూసి ప్రజలు ఓట్లు వేయాలంటూ గతంలో చెప్పిన మోదీ, ఇప్పుడు అధికంగా పెరిగిన ధరలతో వేటిని చూపించి ఓట్లు వేయాలని అడుగుతారని ప్రశ్నించారు. 14 మంది ప్రధానులు కలిసి రూ.40 లక్షల కోట్ల అప్పు చేస్తే, మోదీ ఒక్కరే రూ.80 లక్షల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. కరోనాలో ప్రైవేట్ వైద్యరంగం పూర్తిగా లాభపడిందనీ, ఇప్పుడు ఆ రంగంలోకీ, ఆదానీ అడుగెడుతున్నారనీ, అన్ని వైద్య విధాన ఆస్పత్రులను ఆయన గుప్పెట్లోకి తీసుకునెలా మోదీ ప్రభుత్వం వొత్తాసు పలుకుతోందన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ హడావిడీగా దిల్లీ వెళ్లి ఏం చేశారో ప్రజలకు తెలియడం లేదనీ, రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి, మోదీ దగ్గర సీఎం మోకరిల్లడం విచారకరమన్నారు. పోలవరం నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం, నిధులు ఏమి అడగలేదన్నారు. నాడు 25మంది ఎంపీలని గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని జగన్ పలికిన ప్రగల్భాలు ప్రజలు నమ్మి 22 మంది ఎంపీలను గెలిపిస్తే, ఏం సాధించారని నిలదీశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంపై కనీసం నోరు మెదపడం లేదన్నారు. జగన్ దిల్లీకి వెళ్లి సాధించింది ఏమీ లేదనీ, పోలవరం నిర్వాసితుల పునరావాస ప్యాకేజీ సాధనంలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి యుక్త వయస్సులో చనిపోవడం బాధాకరమని అన్నారు. వైసీపీ నేతలు ఆత్మకూరు నియోజకవర్గంలో పోటీ చేయాలంటూ నిసిగ్గుగా సవాల్ విసరడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ నేతలు కనీసం మర్యాద పాటించడం లేదని, చనిపోయిన వాళ్లకి గౌరవమిచ్చి, వారి కుటుంబ సభ్యులను ఏకగ్రీవం చేసేందుకు తోడ్పడిన పార్టీలకు వైసీపీ కృతజ్ఞత తెలిపితే హుందాగా ఉండేదన్నారు. వైసీపీ చిల్లర నాయకులు నిత్యం తనపైన, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణపైన వ్యక్తిగతంగా చిల్లర రాజకీయాలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా వైసీపీ బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలు విడనాడి, పార్టీ పరంగా ఎదుర్కోవాలని, విమర్శకు ప్రతి విమర్శ చేయాలని సూచించారు. సీపీఐ నేతలు చేస్తున్న విమర్శలకు వైసీపీ దీటుగా స్పందించాల్సిందిపోయి, మాపై ఏవేవో ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. రాజకీయాలు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలేగాని, వాటిని వదిలి మాఫియాలా తయారు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా ఉద్యమాలపై ఆందోళనలు చేస్తున్న ప్రతిపక్షాలను కట్టడి చేసేందుకు వైసీపీ హౌస్ అరెస్టులు చేస్తోందని, ఇదేం సంప్రదాయమంటూ ప్రశ్నించారు. అంబేద్కర్ కోనసీమజిల్లా ఘర్షణకు ప్రభుత్వ తప్పిదమే కారణమని, అక్కడ ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కన్పిస్తోందన్నారు. వైసీపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఆత్మకూరులో గెలవడం కాదనీ, అమలాపురం వచ్చి తొడకొట్టాలని సవాల్ విసిరారు. సీఎం జగన్ దావోస్ పర్యటనతో ఏపీకి ఒక్క కొత్త కంపెనీ రాలేదనీ, ఎప్పుడైతే రాజధాని మూడు ముక్కలన్నారో పెట్టుబడిదారులంతా వెళ్లిపోయారన్నారు.

పెట్టుబడి దారులంతా తెలంగాణకు వెళ్లిపోవడంతో అక్కడ సంపద పెరిగిందని, తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయం వచ్చిపడుతోందన్నారు. జగన్ విధానాలతో తెలంగాణ, దిల్లీలో మోదీ ప్రభుత్వాలే బాగుపడ్డాయని, ఇంకెవ్వరూ బాగుపడలేదని వివరించారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు నారాయణ జవాబిస్తూ, రాబోయే ఎన్నికల్లో అప్పటి కూటమి, రాజకీయ సమీకరణాల ఆధారంగా సీపీఐ విధానం ఉంటుందని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఫార్మా... బిక్కుబిక్కు

(మొదటిపేజీ తరువాయి)

అమ్మోనియా విషవాయువులు వెలువడడంతో తీవ్ర అస్వస్థతకు గురైన 300 మంది మహిళల పరిస్థితి ఇంకా నిలకడగానే ఉంది. అనకాపల్లి, విశాఖపట్నం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇదిలాఉండగా, గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల్లో ఎల్జీ పాలిమర్స్ విషవాయువుల లీకేజ్‌కి గతంలో 20 మంది మృత్యువాత పడ్డారు. ఇక పరవాడ ప్రాంతంలో ఉన్న ఫార్మా పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యానికి పరిసర గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. తగరపలస, భీమిలి, అచ్యుతాపురం, నక్కపల్లి వంటి ప్రాంతాల్లో ఉన్న ఫార్మా కంపెనీలు వ్యర్థాలు వెదజల్లడంతో పరిసర ప్రాంతాల్లో ఉన్న భూగర్భ జల వనరులన్నీ కలుషితమై పోయాయి. వాయు కాలుష్యం సాధారణం కంటే విశాఖలో 20 శాతం అధికంగా ఉంటుందని పర్యావరణ నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రమాదకర రసాయనిక పరిశ్రమలు, పెట్రో, ఫార్మా వంటి పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యానికి విశాఖ వాసులు అల్లాడిపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక వాహనాలు కలిగిన నగరంగా విశాఖ ఉండడంతో మరింత పొగ కాలుష్యం పెరుగుతోంది. హెచ్‌పీసీఎల్, కోరమండల్, జింక్, బీహెచ్‌పీవీ, స్టీల్ ప్లాంట్, డాక్ యార్డ్, విశాఖ పోర్ట్, విశాఖ డెయిరీ, దివీస్, గంగవరం పోర్ట్, ఎల్జీ పాలిమర్స్, అనేక ఫార్మా కంపెనీలు విశాఖ పరిసర ప్రాంతాల్లో ఉండడంతో కాలుష్యం మరింత అధికమవుతుందని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఫార్మా పరిశ్రమల వలన చుట్టు పక్కల గ్రామాల్లో తీవ్ర దుర్గంధం వస్తుండటంతో అస్వస్థతకు గురవుతున్నట్లు వారు వాపోతున్నారు. ముందు చూస్తే నుయ్యి వెనక చూస్తే గొయ్యి అన్న చందాన అటు పరవాడ ఫార్మా ఇటు స్థానికంగా ఉన్న ఫార్మా పరిశ్రమల వలన వేలాది గ్రామాల ప్రజలు రోగాల పాలవుతున్నారు. ఫార్మా పరిశ్రమలతోపాటు దుమ్ము, పొగ, బూడిద అధికంగా వచ్చే మరెన్నో పరిశ్రమల వలన స్థానిక ప్రజలు శ్వాస సంబంధిత వ్యాధులకు అధికంగా గురవుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. కష్టపడి కూలినాలి చేసుకునే వారికి కూడా శ్వాస సంబంధిత వ్యాధులు రావడానికి ఇటువంటి వ్యర్థాల నుంచి వెలువడుతున్న తీవ్ర దుర్గంధమే కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో అనేక వందలాది పరిశ్రమలు ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నప్పటికీ పరిశ్రమ, పర్యావరణ, కార్మిక శాఖల అధికారులు సంయుక్తంగా భద్రతా ప్రమాణాలపై చర్యలు తీసుకోకపోవడంతో అనేక మంది కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఆరోగ్యమైన జీవనం సాగాలంటే నాలుగు పూటల మంచి ఆహారం తీసుకోవాలన్న రోజులు పోయి, పూటకో నాలుగు మాత్రలు వేసుకోవాలన్న రోజులు వచ్చాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గాలి, నీరు, భూమి, ఆకాశం కలుషితమవడంతో వాతావరణంలో అనేక మార్పులు సంభవించి వాతావరణం అనుకూలించక ప్రజలు ఎలా జీవించాలో తెలియని అయోమయ స్థితిలో సతమతమవుతున్నారు. నాయకులు, అధికారులు త్వరితగతిన స్పందించి వ్యర్థ కాలుష్య కోరల్లో ఉన్న ప్రజలను రోగాల బారిన పడకుండా తగు చర్యలు చేపట్టాలని అనేక ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

వర్షాల రాకే ఆలస్యం

(మొదటిపేజీ తరువాయి)

విత్తన సేకరణలో నిమగ్నమయ్యారు. ఏటికేడు వ్యవసాయం గుదిబండలా మారుతున్నప్పటికి... అన్నదాత గంపెడు ఆశలు పెట్టుకున్నా, వ్యవసాయశాఖ సన్నద్ధత తీరు చూస్తుంటే పేరు గొప్ప ఊరుదిబ్బ అన్న చందాన ఉంది. రైతులకు అవగహన కార్యక్రమం చేపట్టాల్సిన అధికారులు ఆచూకీ లేరు. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుకలో సక్రమమైన యాజమాన్య పద్ధతులు, సలహాలు, క్షేత్రస్థాయిలో లేకపోవడంతో, సబ్సిడి ద్వారా ఇచ్చే పరికరాలు, విత్తనాలు ప్రభుత్వం ఇవ్వని నేపథ్యంలో అన్నదాతను ఖరీఫ్ మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

పల్నాడు జిల్లా పంటల సాగు సాధారణ విస్తీర్ణం 7.12 లక్షల ఎకరాలు. దీనినే సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ నిర్ణయించింది. సాగు లక్ష్యం 7,12,375 ఎకరాలు, వరి 1,13,158, పత్తి 3,25,067, మిరప 1,44,655, కంది 52,800, ఇతర పంటలు 76,695 ఉన్నాయి. గత ఏడాది పంటల సాగు ఆశాజనకంగా ఉంది. సకాలంలో వర్షాలు కురవడం, సాగర్ జలాశయం నిండటంతో వరి, పత్తి, మిరప ప్రధాన పంటలు విస్తృతంగా సాగయ్యాయి. ఈ ఏడాది కూడా సకాలంలో వర్షాలు కురవాలని రైతులు వరుణుడిని ప్రార్థిస్తున్నారు. రుతుపవనాలు ప్రభావంతో ఈనెల రెండో వారంలో వర్షాలు కురవచ్చని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. సాధారణ వర్షపాతం నమోదవుతుందని వెల్లడించింది. గత ఏడాది జిల్లా అంతటా పంటల సాగు ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాధారణ విస్తీర్ణంలో 90 శాతానికిపైగా పంటలు సాగయ్యాయి. గత ఖరీఫ్‌లో వరి, మిరప సాగు గణనీయంగా పెరిగింది. రబీలో కూడా విస్తృతంగా వరి సాగు చేశారు. పత్తి, అపరాల పంటల సాగు గత ఏడాది గణనీయంగా తగ్గింది. వర్షాలపై నమ్మకం లేకపోవడం వల్ల ముందస్తు ఖరీఫ్‌పై రైతులు అంతగా ఆసక్తి కనబర్చడం లేదు. సాగర్ ఆయకట్టు పరిధిలోనూ ఆగస్టు తరువాతనే వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగే అవకాశం ఉంది. మెట్టప్రాంతంలో జులై మొదటి వారం నుంచి పత్తి, మిర్చి సాగు ప్రారంభం అవుతుంది. సాగర్ జలాశయం పూర్తిగా నిండి వర్షాలు ఆశాజనకంగా ఉంటే ఆగస్టులో పల్నాడు జిల్లాలో నాట్లు వేసే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఆచితూచి వ్యవహరిస్తుంటారు. సాగర్ జలాశయంలో ఆశాజనకంగా నీటి నిల్వలు ఉన్నాయి. జులై 15న సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా 535.6 అడుగులకు నీటి నిల్వలు ఉన్నాయి. గత ఏడాది కంటే నీటి నిల్వలు అధికంగా ఉన్నాయి. గత ఏడాది 174.6 టీఎంసీల నీటి నిల్వ ఉండగా ప్రస్తుతం 179.29 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. సాగునీటి విడుదల కూడా దాదాపు 20 రోజులు ముందుగానే జరగనుంది. శ్రీశైలం జలాశయంలో 885 అడుగులు పూర్తిస్థాయి నీటిమట్టం కాగా 816.90 అడుగులకు నీటి నిల్వలు ఉన్నాయి. పంటల సాగు ఆశాజనకంగా ఉండాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు. పెట్టుబడులు మరింత భారం కానున్నాయి. నాలుగైదేళ్లుగా పంటలు పాడవడం, రైతుల్ని పీకల్లోతు అప్పుల్లోకి నెట్టింది. యూరియా ఎరువుల కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ ఖరీఫ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం నానో యూరియా లిక్విడ్‌ను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది.

ఇప్పటికే నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు. నానో యూరియా ఒక లీటరు లిక్విడ్ రూ.230కు లభిస్తుందని ఇది పిచికారీ చేస్తే పత్ర రంధ్రాల ద్వారా వేరు వ్యవస్థకు చేరి దిగుబడి పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. తెగుళ్ల ప్రభావం కూడా గణనీయంగా తగ్గుతుందని అంటున్నారు. వ్యవసాయశాఖ నుంచి విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా ఈసారైనా చూడాలని, సకాలంలో రుణాలివ్వాలని, యంత్రాలు అందజేయాలని సాగుదారులు కోరుతున్నారు.

రైల్వేకు 'బొగ్గు' దెబ్బ...!

(మొదటిపేజీ తరువాయి)

రైల్వే శాఖ ప్రయాణికుల సేవల కంటే బొగ్గు బోగీల తరలింపు కోసం ప్రాధాన్యత ఇవ్వవలసి వచ్చిందని అధికారులు తెలిపారు. రాబోయే కొద్ది సంవత్సరాల్లో రూ.1,15,000 కోట్ల కంటే ఎక్కువ విలువైన 58 సూపర్ క్రిటికల్, 68 క్రిటికల్ ప్రాజెక్టలను డెలివరీ చేసేందుకు జాతీయ రవాణా సంస్థ ముందుకు సాగుతోంది. అందువల్ల దాని వ్యవస్థలో నిర్వహణ, నిర్మాణ పనులను కూడా ప్రాధాన్యతగా నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. అయినప్పటికీ, ఇది దేశవ్యాప్తంగా ప్రయాణీకుల రాకపోకలను, ముఖ్యంగా వేసవి నెలల్లో తీవ్రంగా ప్రభావితం చేసింది. ఆర్‌టీఐ ప్రకారం, జనవరి నుంచి మే వరకు రైల్వేలు 3,395 మెయిల్-ఎక్స్‌ప్రెస్ సర్వీసులను రద్దు చేశాయి. అదే సమయంలో నిర్వహణ లేదా నిర్మాణ పనుల కారణంగా 3,600 ప్యాసింజర్ సర్వీసులను రద్దు చేసింది. జనవరి, ఫిబ్రవరిలో బొగ్గు తరలింపు కారణంగా రైలు సర్వీసులను రద్దు చేయలేదు. గత మూడు నెలల్లో బొగ్గు రేకుల ప్రాధాన్యత కారణంగా 880 మెయిల్-ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు, 1,054 ప్యాసింజర్ సేవలు రద్దయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం, 2021-22లో టికెట్లు కొనుగోలు చేసిన 1.60 కోట్ల మంది ప్రయాణికులు వెయిట్-లిస్ట్‌లో ఉన్నందున ప్రయాణించలేకపోయారు. ఇది రద్దీగా ఉండే మార్గాల్లో రైళ్ల కొరతను సూచిస్తోంది. ఇక బొగ్గు రేక్‌ల ప్రాధాన్యత కారణంగా రైల్వే వాస్తవానికి మే 2022లో 131.6 మిలియన్ టన్నుల (ఎంటీ) నెలవారీ సరుకు రవాణాలో అత్యుత్తమంగా నమోదు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు రవాణా చేయడం, దేశీయ, దిగుమతి రెండూ మే నెలలో 11 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ పెరిగింది. గత సంవత్సరం 41.01 మెట్రిక్ టన్నుల నుంచి 52.4 మెట్రిక్ టన్నుల బొగ్గును విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు తరలించింది. ఇది 28 శాతం వృద్ధిని నమోదు చేసింది. మొత్తంగా ఈ సంవత్సరం మొదటి రెండు నెలల్లో భారతీయ రైల్వేలు గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 24 శాతం వృద్ధితో 18 మెట్రిక్ టన్నుల అదనపు బొగ్గును విద్యుత్ కేంద్రాలకు రవాణా చేశాయి.

గణాంకాల ప్రకారం, 2019-2020లో ప్రయాణీకుల రంగ అవసరాలు 8.4 బిలియన్లు, వెయిటింగ్ లిస్ట్‌లో సగటు తగ్గుదల 8.9 శాతంగా ఉంది. రద్దీగా ఉండే సీజన్‌లో 13.3 శాతం మంది ప్రయాణీకులు ధృవీకరించబడిన రిజర్వేషన్లను పొందలేకపోయారు. ప్రయాణీకుల నుంచి మరిన్ని రైళ్ల డిమాండ్‌తో రైల్వే బడ్జెట్‌ను 2016లో సాధారణ బడ్జెట్‌లో విలీనం చేసినప్పటి నుంచి గత ఆరేళ్లలో రైల్వే సుమారు 800 కొత్త రైళ్లను ప్రవేశపెట్టింది. సగటున రైల్వేలు రోజుకు 11,000 రైళ్లను నడుపుతున్నాయి.

పౌష్టికాహార పథకంలో రూ.77 కోట్ల నష్టం

తమిళనాడు బీజేపీ ఆరోపణ

చెన్నై : గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించేలా ప్రవేశ పెట్టిన పథకం ద్వారా ప్రభుత్వానికి రూ.77 కోట్ల మేర నష్టం వాటిల్లుతోందని తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె అన్నామలై అన్నారు. పౌష్టికాహారాన్ని కిట్‌ల రూపంలో అందించేలా ప్రైవేటు కంపెనీతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ఖజానాకు భారమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఏజెన్సీల కన్నా ప్రైవేటు ఏజెన్సీల ఎక్కువ ఖర్చు అవుతోందని తెలిపారు. ప్రభుత్వ రంగంలోని అవిన్ సంస్థ ద్వారా కిట్‌లను గర్భిణిలకు అందించాలని సంబంధిత కమిటీ నివేదిస్తే దాన్ని కాదని ప్రైవేటు సంస్థకు అప్పగించి ఖజానాపై భారం మోపారని పేర్కొన్నారు. ఇదంతా ఒక కీలక వ్యక్తి ఆదేశాలతోనే జరుగుతోందని పేర్కొన్నారు. అవిన్ సంస్థ అందించే హెల్త్ మిక్స్ ధర కన్నా ప్రవేటు సంస్థ ధర 60 శాతం ఎక్కువగా ఉందని దీని ద్వారా ఏటా రూ.45 కోట్ల భారం పడుతుండగా, ఐరన్‌ను పోషకం ధర కూడా దాదాపు రెట్టింపు ధర ఉందని తెలిపారు. ఈ రెండింటి ద్వారా ప్రభుత్వానికి రూ.77 కోట్ల మేర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. తక్షణమే ప్రైవేటు కంపెనీతో ఆ ఒప్పందాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోని సహకార సంస్థ ఆవిన్‌కు కిట్ పంపిణీ బాధ్యతలను అప్పగించాలని డిమాండు చేశారు.

అదానీ బొగ్గుకు కుదిరిన బేరం

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కొన్ని నెలలుగా దేశంలో కృత్రిమ బొగ్గు కొరతను మోదీ ప్రభుత్వం సృష్టించి, విద్యుత్ సంక్షోభానికి కారణమైందని, తాను అనుకున్నట్లుగానే తుదకు అదానీ దిగుమతి బొగ్గుకు బేరం కుదిరేలా చేసిందనీ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు విమర్శించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కంపెనీ నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ)కి 62.5 లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు ఒప్పందం కుదిరిందని, దీని విలువ రూ.6,585 కోట్లుగా ఉందని పేర్కొన్నారు.

మానవ మనుగడకు

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం

- ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

మొక్కలు నాటుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: మానవమనుగడకు పర్యావరణ పరిరక్షణ ముఖ్యమనీ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించినప్పుడే భావితరాలకు మంచి భవిష్యత్తు, ఆరోగ్య కర సమాజాన్ని అందించడం సాధ్యం అవుతుందని వక్తలు పేర్కొన్నారు. ప్రబీపపంచ పర్యావరణ దినం సందర్భంగా ఇస్కఫ్ అధ్వర్యాన ఆదివారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో మొక్కలు నాటడం, సమావేశాలు జరపడం వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాకుళంలోని ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరై భవన్ అవరణలో మొక్కను నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సమాజం లో భూ భాగం మీద వ్యర్థాలు పెరిగి మానవుని తో పాటు అనేక జీవరాశులకు నష్టం చేకూరుతోందన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగం పెరగడం వలన అవి భూమిలో కలవక పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రభుత్వాలు నామ మాత్రపు చర్యలు తీసుకోవటం వలన రోజు రోజుకు ప్లాస్టిక్ వినియోగం పెరుగుతోందని, ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకుని ప్రమాదకర ప్లాస్టిక్ కవర్ల ఉత్పత్తిని నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకృతిని మనం ప్రేమిస్తే అది మనల్ని కాపాడుతుందనీ, ఆ దిశగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలిగి మొక్కలు నాటి వాటిని సంరక్షించి భావితరాలకు మంచి ఆరోగ్య కర సమాజాన్ని అందిద్దామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం సీపీఐ జిల్లా కార్యదర్శి సనపల నర్సింహులు, రాష్ట్ర సమితి సభ్యులు చాపర సుందర్‌లాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ, చిక్కాల గోవిందరావు, బలగ శ్రీరామమూర్తి, పట్టా ప్రభావతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ. లోకనాథం, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఏ. రాజు, కార్యదర్శి జీవీ నాగభూణరావు, సభ్యులు నూతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నంలో:

పర్యావరణాన్ని రక్షించకపోతే మానవ మనుగడకు పెనుముప్పుతప్పదని నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య బాల మోహన్ దాస్ హెచ్చరించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటాలని కోరారు. ఆదివారం ఉదయం జీవీఎంసీ ఎదురుగా గాంధీజీ విగ్రహం వద్ద (ఇస్కఫ్),ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్, సామ్నా అధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా మొక్కలు పెంచే బాధ్యత కూడా ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. సత్యనారాయణ, ఇస్కఫ్ ప్రతినిధులు టీఎస్ సుకుమారన్, జేవీ ప్రభాకర్, రాంప్రభు, అరసం నాయకులు శ్యామ్ ప్రసాద్, కార్టూనిస్ట్ హరి, ఉపాధ్యాయురాలు సత్యవతి సామ్నా విశాఖ జిల్లా అధ్యక్షులు డి.యస్.యస్.యస్.కె.హరనాథ్, ప్రధాన కార్యదర్శి కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.శివకుమార్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి కె.చక్రవర్తి,తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో:

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ త్రినాథప్రసాద్ అన్నారు. ఇక్కడి జిల్లా కేంద్ర గ్రంధాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణానికి ఎంతో ముప్పు కలుగుతుందన్నారు. ముఖ్య అతిధి డాక్టర్ ఎ.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వర్తమాన కాలంలో పర్యావరణ పరిస్థితులు, దాన్ని కాపాడుకోవలసిన ఆవశ్యకతను సోదహరణంగా వివరించారు. పర్యావరణ పరిరక్షణ యువత పాత్ర ఎంతో ఉందన్నారు.అల్లంకి బసవమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎస్కే బాషా, కోశాధికారి రమణారావు, ప్రజాగ్రంథాలయ వ్యవస్థాపకులు షణ్ముఖరావు, ఇస్కఫ్ సభ్యులు పాల్గొన్నారు.

విజయవాడలో:

ఇస్కఫ్ విజయవాడ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు, హైకోర్టు న్యాయవాది ఓలేటి శివ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. ప్లాస్టిక్ విపరీత వాడకం వల్ల భూమిపై అనేక జీవ రాశులు అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్ పిచ్చయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గుర్తించిన ఐక్యరాజ్య సమితి 1972 నుంచి ఏటా జూన్ 5 న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్ తరానికి పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కల్గించే బాధ్యత అందరి పైన ఉందని అన్నారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ళ నారాయణ రావు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి మోతుకూరి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందింప జేయాలని సూచించారు. ఇస్కఫ్ నాయకులు మహబూబ్ ఆజం, మోతుకూరి అరుణకుమార్ ఏఐఎస్ఎఫ్ నాయకులు జి ఓబులేశు, ఎం. సాయి కుమార్ , జేవీవీ నాయకులు కొడాలి రవిబాబు తదితరులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అవశ్యకతను వివరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అందరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, అమరావతి సచివాలయంలో ఆదివారం ఆయన మొక్కలు నాటారు. పర్యావరణ స్నేహపూర్వక కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని భారత ఎన్నిక సంఘం మే 26న నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆదేశించిందన్నారు. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. ఎన్నికల కార్యాలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి నిర్ణీత కాలంలో నియంత్రించేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రీన్ ప్రోటోకాల్ కింద ప్లాస్టిక్‌ను, నాన్-సస్టెయినబుల్ ఐటెమ్స్‌ని నియంత్రిస్తూ భవిష్యత్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిప్యూటీ సీఈవో వెంకటేశ్వరరావు, మల్లికార్జున్‌రెడ్డి, అధికారులు కొండారెడ్డి, ప్రధాన ఎన్నికల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆసరా' పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆసరా జాతీయ సమ్మిట్ వాల్ పోస్టర్‌ను రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విడుదల చేశారు. విజయవాడ మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆసరా ఎన్టీయార్ జిల్లా బృందం ఆదివారం ఆయన్ని కలిసి, ఆసరా జిల్లా శాఖ వార్షిక నివేదికను అందించారు. వినియోగదారుల సంక్షేమం కోసం, హక్కుల పరిరక్షణకు ఆసరా సంస్థ ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించినదీ మంత్రి కారుమూరికి వివరించారు. ఆసరా బ్రోచర్, టోల్ ఫ్రీ నెంబర్, మొబైల్ వ్యాన్ ద్వారా వినియోగదారుల ప్రచార కార్యక్రమాన్ని మంత్రికి ఆసరా జోనల్ అధ్యక్షుడు కాకాని తరుణ్, ఆసరా ద్వారా నమోదైప వినియోగదారుల కేసుల వివరాలను ఆసరా జోనల్ ఇన్‌ఛార్జ్ కోనేరు మధు వివరించారు. మంత్రి కారుమూరి నాగేశ్వరావుకు ఆసరా జాతీయ సమిట్ ఆహ్వాన పత్రాన్ని ప్రతినిధుల బృందం అందజేసింది.

విశాఖలో టీడీపీ నేతల అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రుషికొండపై మొక్కలు నాటేందుకు ప్రయత్నించిన టీడీపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. టీడీపీ నాయకులు రుషికొండ జంక్షన్ వద్దే రోడ్డుపై బైఠాయించారు. రుషికొండను, వైజాగ్‌ను కాపాడాలి అని నినదించారు. పోలీసులు ఎంత చెప్పినా వెళ్లకపోవటంతో టీడీపీ నాయకులను ఏసీపీ చుక్కా శ్రీనివాస్ అధ్వర్యంలో సీఐ అడబాల రవికుమార్ అరెస్టు చేసి పీఎమ్ పాలెం పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా రుషికొండ జంక్షన్ వద్ద టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ...మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి రేపటి తరానికి తెలియచేయాలని ప్రయత్నిస్తే తమని పోలీసులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. పర్యావరణ దినోత్సవం రోజున కొన్ని మొక్కలను నాటి ప్రశాంతంగా నినాదాలు చేసి వెళ్లటానికే వచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కోరాడ రాజబాబు, దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గండి బాబ్జి, మహిళా నాయకులు అనంతలక్ష్మి, బోయ రమాదేవి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, గొల్లంగి ఆనందబాబు, వాండ్రాసి అప్పలరాజు, ఈగల రవి, నాగోతి సత్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్ల చేతుల్లో పాలకులు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - నర్సీపట్నం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం అనకాపల్లి జిల్లా, గొలుగొండ మండల సీపీఐ 13వ మహాసభలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అల్లూరి సీతారామరాజు పార్కులో మేకా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో జగన్ పాలనపై ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి ఉందన్నారు. ప్రజల కష్టార్జితాన్ని అమ్మేయడంలో ఒకరు, తాకట్టు పెట్ట దాన్ని మరొకరు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అంబానీ, అదానీల చేతుల్లోకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెళ్లిపోయాయయని, వారే పాలన సాగిస్తున్నట్టు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక చర్యలను పక్కన పెట్టి అభి వృద్ధి పనులపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం మేకా భాస్కరరావు మండల కార్యదర్శిగా 26 మంది సభ్యులతో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామునాయుడు, జి. గురుబాబు, ఏఐయూటీసీ రాష్ట్ర సమితి సభ్యుల ఎల్వి.రమణ, డీహెచ్‌పీఎస్ గౌరవాధ్యక్షులు డీసీహెచ్. క్రాంతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శివలంక కొండలరావు ఏఐవైఎఫ్ నేత జి. రాధాకృష్ణ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణలో భాగస్వాములుకండి

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: ఉక్కుపరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపు నిచ్చింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 479వ రోజుకు చేరుకున్నాయి. ఈదీక్షల్లో ఉక్కులోని అన్ని విభాగాలకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. దీక్షలను ఉద్దేశించి పోరాట కమిటీ నేతలు డి.ఆదినారాయణ, మురళీ కృష్ణ, భోద్ద గోవింద్, పిట్టా రెడ్డి మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో కాంట్రాక్ట్ కార్మికులు కూడా నిరసన దీక్షలో పాల్గొనడం అభినందనీ యమన్నారు. ఉక్కును ప్రైవేటీకరణ బారి నుంచి కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అన్నారు. ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని అన్నారు. పోరాడితేనే ఉక్కును కాపాడుకొగలమన్నారు. ఈ దీక్షల్లో కార్మిక నేతలు కె.రాజబాబు. గుమ్మడి నరేంద్ర, వరసాల శ్రీనివాసరావు, మంత్రి రవి, సొంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

కోదండరామ్, హరగోపాల్ మద్దతా? డొక్కా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రైతుల పేరిట జరుగుతున్న ఉద్యమానికి 900రోజుల కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్ సమాచారం సరిగ్గా తీసుకోకుండా వచ్చి పొరపాటు చేశారని భావిస్తున్నామని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇది దళిత రాజధాని అంటే ఎలా నమ్మేశారని అడుగుతున్నామని ప్రశ్నించారు. కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టాలన్న అన్ని పక్షాలు విజ్ఞప్తి మేరకు బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు పెడితే పెద్ద విధ్వంసమే జరిగిందని, ఆ ఘటనలో ఎస్సీ మంత్రి, బీసీ ఎమ్మెల్యే ఇళ్లను తగలబెట్టి, హింసాకాండకు దిగారన్నారు. దాన్ని ప్రశ్నించలేనివాళ్లు, ఆ ఘటనను ఖండించనివాళ్లతో హరగోపాల్, కోదండరామ్ కలిసి మాట్లాడటమేమిటని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో భూ సమీకరణ జరిగేటప్పుడు దళిత రైతుల భూముల విషయంలో వాళ్లకు ప్యాకేజీ రాదని, ప్రభుత్వం ఉన్నపళంగా రైతుల భూములు లాగేసుకుంటుందని బెదిరించారన్నారు. రైతులను భయపెట్టి వాళ్ల దగ్గర నుంచి టీడీపీ అనుయాయులు కొనుగోలు చేశాక, ఆ భూములకు ప్యాకేజీ ఇచ్చి, దాన్ని చట్టబద్ధత చేశారు. అసలు భూముల కోసం రాజధానా?, రాజధాని కోసం భూములా? అని ప్రశ్నించారు. టీడీపీ మహానాడులో అంబేద్కర్ పేరు మీద జిల్లా ఉండాల్సిందే అని చంద్రబాబు తీర్మానం చేస్తూ ప్రభుత్వాన్ని ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం జగన్, రాష్ట్ర మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చోటు కల్పిస్తూ పెద్ద పీట వేశారన్నారు. 25మంది మంత్రుల్లో 17మంది బడుగు, బలహీన వర్గాల వారికి ప్రాధాన్యత కల్పించడమే కాకుండా అనేకమందికి ఎమ్మెల్సీ పదవులు, నామినేటెడ్ పదవులు కట్టబెట్టి ప్రోత్సహిస్తున్నారని వివరించారు. పేదవారికి, దళితులకు పదవులు ఇవ్వడాన్ని ప్రోత్సహించనివారిని, సమాజంలో వారికి గౌరవం దక్కడాన్ని, వారికి న్యాయం జరగడాన్ని వ్యతిరేకించేవారితో కలిసి కోదండరామ్, హరిగోపాల్ పంచుకోవడం బాధాకరమన్నారు.

ఆకలి చావులకు మరమగ్గాలే కారణం

- 'చేనేత' ఉనికి లేకుండా చేస్తే ప్రతిఘటిస్తాం
- ఏపీ చేనేత కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింక చలపతి

విశాలాంధ్ర-ధర్మవరం టౌన్: చేనేత కార్మికుల ఆత్మహత్యలకు, ఆకలిచావులకు ప్రధాన కారణం మరమగ్గాలేనని, వాటికి పూర్తిగా అనుమతి, అధికార పత్రాలు లేకుండానే విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయని, చేనేత పరిశ్రమ ఉనికిని లేకుండా చేసే తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింక చలపతి హెచ్చరించారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ రంగం తర్వాత రెండో స్థానంలో చేనేత పరిశ్రమ ఉందని, దాన్ని ఆదుకోవడంలో పాలకవర్గాలు, ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల్లో లక్షల కుటుంబాలు, చేనేతను నమ్ముకొని జీవనం సాగిస్తున్నాయని, దీన్లో భాగంగా ధర్మవరం పట్టణం చేనేతకు ప్రసిద్ధి గాంచినదని, 15,0000 కుటుంబాలు చేనేతను నమ్ముకుని జీవిస్తున్నారని తెలిపారు. చేనేత పరిశ్రమకు సంబంధించిన రేషన్, ముడిసరుకులు అధిక ధరలు ఉండటంతో పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి మరమగ్గాలే కారణమని ఆయన అన్నారు. పదేళ్లుగా విచ్చలవిడిగా మరమగ్గాలు ఉండడం బాధాకరమని, అధికారికంగా అనుమతి లేఉండా, అక్రమ విద్యుత్‌ను వాడుకుంటూ, రెసిడెన్షియల్ ఏరియాల్లో మరమగ్గాలు ఉండరాదని, ఈ విధంగా ఉంటే శబ్దకాలుష్యం రావడం, పిల్లల చదువులు, నిద్రకు ఆటంకంతో పాటు, అనారోగ్యానికి గురవుతున్నారని, అయినా ఏ అధికారీ పట్టించుకోవడం లేదన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని మరమగ్గాల వారు అమలు చేయడం లేదన్నారు. అతి త్వరలోనే అన్ని విభాగాల అధికారుల కార్యాలయాలపై ఉధృతంగా పోరాటం చేసి, వారందరికీ వినతి పత్రాలను అందజేస్తామన్నారు. చేనేత పరిశ్రమను కాపాడుకోవడం అందరి బాధ్యత అని చలపతి తెలిపారు. పట్టణ చేనేత నాయకులు వెంకట నారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

పవన్ సీఎం కావాలి: నాదెండ్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అభిమాన సంఘాలు రాజకీయ ప్రక్రియలో భాగం కావాలని, పవన్ కల్యాణ్‌ను సీఎం చేసేందుకు అందరూ కలిసి రావాలని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కోరారు. మంగళగిరి జనసేన రాష్ట్ర కార్యాలయంలో మెగా అభిమాన సంఘాలతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. గ్రామ స్థాయి నుంచి వార్డు స్థాయి వరకు పార్టీని పటిష్టం చేయాలన్నారు. కరోనా సమయంలో చిరంజీవి బ్లడ్ క్యాంప్ ద్వారా ఆక్సిజన్ల సరఫరా ద్వారా మంచి పేరు వచ్చిందని, వరదల సమయంలోనూ మెగా అభిమానులు ప్రజలకు ఎంతో సాయం చేశారన్నారు. పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అంతా ఐక్యతతో ఉండాలని, ఎక్కడా తగ్గొద్దని సూచించారు. పది మందికి సాయం చేయాలనేదీ మెగా కుటుంబానికి బలమైన కోరిక ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజల సమస్యల్ని చూస్తుంటే బాధేస్తోందని చెప్పారు. సీఎం జగన్ బటన్లు నొక్కడం, ప్రకటనలు ఇవ్వడానికే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ పనితీరు ప్రజలకు ఇబ్బంది పెట్టేలా ఉందన్నారు. వివిధ జిల్లాలకు చెందిన మెగా అభిమానులు పాల్గొన్నారు.

8న ఏపీ పీటీడీ(ఆర్టీసీ) సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల పీఆర్సీ జీవోల్లో జరిగిన అన్యాయంపై చర్చించేందుకు ఈనెల 8న విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక తెలిపింది. ఈ మేరకు ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్లు వై.శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరావు, కో-కన్వీనర్లు సీహెచ్.సుందరయ్య, జేఏసీ రాష్ట్ర నాయకులు వైవీ రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు 11వ పీఆర్సీకి చెందిన తాజాగా వచ్చిన జీవోలతో ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. ఈ జీవోలతో ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ చైర్మన్ మిశ్రా ఇచ్చిన నివేదిక ప్రకారం ఇవ్వలేదనీ, పీటీడీలోని చాలా కేటగిరీల ఉద్యోగులకు అన్యాయం జరిగేలా వేతనాలు నిర్ణయించారనీ, అలవెన్సుల్లోనూ కోత విధించారని పేర్కొన్నారు. ఉద్యోగుల పట్ల ఆర్టీసీ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలపైన, పెండింగ్ సమస్యల పరిష్కారంపైన చర్చించేం దుకుగాను జేఏసీ సమావేశం ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో ఆర్టీసీ జేఏసీ కార్యాచరణపై చర్చిస్తామని నేతలు తెలిపారు.

పోలవరంపై అంబటి అసత్య ప్రచారం: ఉమ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం అంశంలో టీడీపీపై పదే పదే మంత్రి అంబటి రాంబాబు తప్పుడు ఆరోపణ చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. పోలవరం బహుళార్థక సాధక ప్రాజెక్టు అని, 50లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశముందని వివరించారు. నాడు సోమవారం పోలవరంగా మార్చి కేంద్ర, రాష్ట్ర అధికారుల సమన్వయంతో చంద్రబాబు పనులు చేయించారని, అప్పటి కేంద్ర మంత్రి గడ్కరీ కూడా ప్రశంసించారన్నారు. మంత్రి రాంబాబుకు దమ్ముంటే కేంద్ర మంత్రి షెకావత్ చేసిన పోలవరం రివ్యూ ? మినిట్స్, విజువల్స్ బయట పెట్టాలని డిమాండు చేశారు. రివర్స్ టెండరింగ్‌లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాలు పాటించారా? ఆ ఆదేశాల ప్రకారమే జీవో 67 ఇచ్చారా? అని ప్రశ్నించారు. పోలవరంలో జగన్ తప్పు బయట పడకూదని తెలంగాణకు చెందిన వెదురు శ్రీరామ్ అనే వ్యక్తికి పోలవరం సమీక్షా బాధ్యతను అప్పగించారన్నారు. అంటే పోలవరం డ్యామ్ బ్యారేజీగా మార్చి, 100అడుగుల వైఎస్ విగ్రహం పెట్టి, రూ.913కోట్లతో ఇంకో నది తవ్వుతూ బ్యారేజీగా మారుస్తున్నారని విమర్శించారు. ఢిల్లీ పర్యటనలో కేంద్రాన్ని జగన్ ఏం అడిగారనీ, జగన్ జాతీయ మీడియాతో మాట్లాడే ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. పోలవరం పనుల పేరిట అవినీతికి పాల్పడిన జగన్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. అమరావతిని నిర్వీర్యం చేశారనీ, దీనిపై కోర్టు చారిత్రత్మాక తీర్పు ఇచ్చినా కోర్టు ధిక్కరణ ఎదుర్కొటుంటున్నారేగానీ, పనులు చేయడం లేదన్నారు. పెట్రోల్, డీజీల్ ధరలు కేంద్రం, పక్క రాష్ట్రాలు తగ్గించినా, మన రాష్ట్రం ఎందుకు తగ్గించడం లేదంటూ మండిపడ్డారు.

జగన్, పెద్దిరెడ్డి స్వార్థానికి కృష్ణపట్నం బలి: కళా వెంకట్రావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి స్వార్థానికి కృష్ణపట్నం పోర్టును బలి చేశారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకట్రావ్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారనీ, చార్జీల వాతలతో విద్యుత్ వినియోగదారులు కుంగిపోతున్నారని పేర్కొన్నారు. కృష్ణపట్నం సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్‌ను చంద్రబాబు ప్రభుత్వం నిర్మించి, 2400 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో జగన్ చేతుల్లో పెట్టారన్నారు. మూడో యూనిట్ నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయనీ, దాన్ని ప్రారంభించేలోపు ఎన్నికలు రావడం, ప్రభుత్వం మార్పు జరిగాయని తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నప్పటికీ, మూడో యూనిట్లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించ లేదన్నారు. ఈ రకంగా 2400 మెగావాట్ల కృష్ణపట్నం ప్లాంటును జగన్ నిర్లక్ష్యం చేశారని, కరెంటు కోతలు పెట్టి ప్రజల్ని అల్లాడిస్తున్నారని మండిపడ్డారు. కడప ఎంపీ అవినాశ్ రెడ్డి బినామీలకు సోలార్ విద్యుత్ ప్లాంటును కట్టబెట్టడానికి ఇబ్రహీంపట్నంలో ఉన్న నార్ల తాతారావు థర్మల్ ప్లాంట్, రాయలసీమ థర్మల్ ప్లాంట్, కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్లను దెబ్బతీస్తున్నారన్నారు. కృష్ణపట్నం ప్లాంట్‌లో జరుగుతున్న అవకతవకలపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజీనామా చేయాలని డిమాండు చేశారు.

ముగిసిన గురుకులాల ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధీనంలోని ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్, రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల-నాగార్జునసాగర్‌లో డిగ్రీ మొదటి సంవత్సరాల (2022-23 విద్యా సంవత్సరం) ప్రవేశాల కోసం ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష ముగిసింది. 268 పరీక్షా కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ, జిల్లా విద్యాశాఖాధికారుల అధ్వర్యంలో ప్రశాంతం పరీక్షలు జరిగాయి. జూనియర్ కళాశాలల్లో ప్రవేశ పరీక్షకు 61,009 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 54,112(88.7శాతం) మంది, డిగ్రీ కళాశాలల్లో 2,154 మంది దరఖాస్తు చేసుకోగా 1,789(83శాతం) మంది హాజరయ్యారని గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు తెలిపారు.

సాహితి

అత్యాశల ఆకులు..

మోడువారిన వృక్షానికి
ఆశల చిగుర్లు పూస్తే
నిరాశల కొమ్మకు
అత్యాశల ఆకులు మొలిచాయి..
ఆలోచనల అంతర్యానికి
అదో సర్వాంతర్యామిలా కన్పిస్తే
అభిజాతాల అభిమతాలకు
లోభిత్వ లోలకాలు వేలాడుతున్నాయి..
శ్రమించే స్వభావానికి
కక్కుర్తి సంభావ్యత దొరికితే,
ఊరి శివారు మర్రిచెట్టుపై వేలాడుతున్న
గబ్బిలాల్లా ఆదర్శ భావజాలానికి
అనంత కోరికలు వేలాడుతున్నాయి..
అవసరమున్నవారికి అది
ఆకస్మిక విభ్రమకు గురిచేస్తే
ఇచ్చేవాడికే వచ్చే ఆ బహుమతి
సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది..
పొద్దస్తమానం చెప్పే పాఠాలు,
పోరాటం గురించి పడే ఆరాటాలు,
ప్రస్తుతం దానికోసం తాపత్రయపడి
రెపరెపలాడుతున్నాయి..
ఉన్నఫలంగా ఉన్న చోటును
వదిలేసి వేరే జిల్లాకు వెళ్తే,
పాత జిల్లాకు వెళ్ళడానికి
కొత్త ఆలోచనలు మొగ్గ తొడుగుతున్నాయి..
పరస్పర బదిలీల అవకాశాలు
ఆస్పర్ గడ్డి మొక్కల్లా అక్కడక్కడ మొలిస్తే
అవసరమున్నవారికంటే
వాటిని కోసుకుని అమ్ముకోవాలనుకున్నవాడిదే
పైచెయ్యి అవుతోంది..

సర్ఫరాజ్ అన్వర్, 9440981198

దాశరథి రంగాచార్య- జీవన సాహిత్యం

గెల్లి రామమోహనరావు
ఫోన్: 0863-2357514

"పరిపూర్ణమైన విశ్వాసంతో కమ్యూనిస్టు పోరాటాల్లో పాల్గొన్నాను. స్వాతంత్ర్యం వచ్చిన ఫలితాలు ఆశించలేదు. బట్ట విడిచినట్లు రాజకీయాలు వదలి స్వయం కృషితో డిగ్రీలు తెచ్చుకొని ఉదర పోషణార్థం ఉద్యోగం చేశారు. నేను ఎవ్వరి శుశ్రూష చేయలేదు. ఆశ్రయించలేదు. ఉపదేశం పొందలేదు. నాకు గురువులు లేరు. శిష్యులు లేరు. నను కనిపెంచినట్టి తెలంగాణాకు నా కర్తవ్యంగా తెలంగాణ ప్రజా జీవితాన్ని చిత్రించే నవలలు రాశాను. ఇహ ఎవరూ రాయలేరు. నిజదారసుతోదర పోషణార్థం తప్ప మిగతా జీవితమంతా ప్రజా సేవకు, మానవ సేవకు ఫలాపేక్ష రహితంగా అంకితం చేస్తానని చెప్పగలను" అంటారు దాశరథి రంగాచార్య (జీవనయానం 507 పేజీ).

వారు నాస్తికత్వ హేతువాదాల నుండి బయటకు వచ్చారు. దాదాపుగా 12000 పేజీలు కేవలం అచ్చు పేజీలు రాశారు. ఆయన జీవితంలో చీకటి రోజులు వెన్నెల సోనలు సంభవించాయి. చతుర్వేదాలు తెలుగున కనువదించి తెలుగు వారికి నూతనోత్తేజం పాదుకొల్పారు. ఇంత చేసినా ఏదో చేయాలనే తపన వారిని వెంటాడు తుండేది. నవలలు, కథలు, నాటికలు రాసి తెలుగు జనులకు తెలంగాణా 'జీవనయానాన్ని కనులకు కట్టినట్లు చూపించారు. కష్టాలు, నష్టాలు వాటిల్లాయి. తల్లి వెంకటమ్మ, తండ్రి వెంకటాచార్యులు. తల్లి వెంకటమ్మే బిడ్డలను కాపాడుతూ వచ్చింది. ఉన్నంతలోనే జీవితం గడచింది. కాని డబ్బైఏళ్ల జీవనయానంలో కన్నీళ్లు వచ్చాయి. భార్య కమల తనచెంగుతో కన్నీరు తుడిచింది. ఆవేదన అలముకొన్నది. అభిరుచులేమిటి? రాగద్వేషాలే మిటనే విచికిత్స బయలుదేరింది. తనను తాను తెలిసి కొనలేకపోయారు. పోనీ నాయనగారిని అడుగుదామంటే ఆయనను చూస్తేనే హడలు. మరేమి చేయలేక అమ్మతో చెప్పుకొని బరువు దించుకొనేవారు. ఒక్కొక్కసారి సంతోషంలేని జీవనమయ్యిందని విచారించినా కర్తవ్యాన్ని మరవలేదు.

నిజాం పాలన కాలంలో నిలువనీడ లేదు. అమ్మ భాషకు స్థానం లేదు. అంతా ఉరుదులోనే మాట్లాడాలని శాసనం. శాసన ధిక్కారానికి పాల్పడితే నిర్దాక్షిణ్యంగా ప్రాణాలు తీసేవాడు. నాటి సామాజిక జీవనాన్ని నవలల్లో చూపించారు. సాంస్కృతిక స్వేచ్ఛకు నవాబుకు నిరసన సెగ తగిలింది. రాజు మొద్దు రాచిప్ప. అయినా తెలుగు ప్రజల జీవన గమనాన్ని పరిశీలన చేస్తూ అరాచకం అందలం ఎక్కుతుంది. క్షణంలో ప్రాణాలెగిరిపోతాయి. దురాగతాలను రూపుమాపాలని తోటి మిత్రులతో కలిసి ఉద్యమం సాగించారు. ఇవన్నీ తాటాకు చప్పుళ్లని జమకట్టి పోలీసులతో దెబ్బలు కొట్టించాడు. పట్టిన పట్టు వీడలేదు. నిజాం కొంతమందిని బందీలుగా చేశాడు. రాజుగారు కొంతమందికి భూములిచ్చినట్లే ఇచ్చి బలవంతంగా గుంజాడు. ఇదేమీ చోద్యమని అందరూ నివ్వెరపోయారు. ఇదిలా ఉండగా దేశముఖులు శిస్తు వసూలుకు వస్తే వారి కన్నంలో విషం కలిపి పెట్టారు. ఆ దెబ్బకు దేశముఖులు తోక ముడిచారు. ఇచ్చ వచ్చిన చోట్ల మసీదులు నిర్మాణం చేశారు. అది మహ్మదీయులకు పరిమితం. హిందువులు దేవాలయ నిర్మాణం చేస్తే సవాలక్ష ఆటంకాలు కల్పించి కట్టనీయకుండా చేసేవారు. ప్రశ్నిస్తే చాలు ప్రాణాలు తీసేవారు. హిట్లరు దుర అహంకారాన్ని నిజాం రాజు పుణికి పుచ్చుకొన్నాడు. "రాజకీయం మనిషిని చీల్చగలదు. సాహిత్యం సంస్కృతి మనిషిని ఏకం చేస్తాయేగాని చీల్చలేవు".

నిజాం పరమ కర్కోటకుడు. వివాహితలు బయటకు వస్తే చాలు పుస్తెలు తెంపి ఎత్తుకొని పోయేవాడు. ఇంకా పైగా మానభంగాలు చేసేవారు. ఎదురుతిరిగితే చంపే వారు. అందువల్ల స్త్రీలు బయటకు వచ్చేవారు కాదు. ఉస్మాన్ అలీఖాన్ 1911 లో సింహాసనంపై కూర్చొన్నాడు. అతనికి తన భాషేముద్దు. తెలుగు భాష వద్దని రంకెలు వేశాడు. పథకంప్రకారం తెలుగుభాషను రూపుమాపాడు. తన భద్రతకొరకు ఒకే మతం, ఒకే భాషను పోషించాడు. ప్రజాభిప్రాయంతో పనిలేదు. తన మాట అల్లా ప్రవక్త మాటని విర్రవీగాడు. 1918 లో 'ఉస్మానియా విశ్వ విద్యాలయాన్ని' స్థాపించాడు. ఆంగ్లేయులు రాజు ఇన్ని అమానుష కృత్యాలు చేస్తున్నా నోరు మెదిపేవారు కాదు. తమ స్వార్థం తమకున్నది. అందువల్ల ఉస్మాన్ మరీ బరి తెగించాడు. తనపంతం నెగ్గించుకొన్నాడు. మహ్మదీయులే గాక తెలుగువారు ఉరుదులో మాట్లాడటం చేయగలిగారు.

కాలం మారుతూ వస్తూంది. నాయకులు, భాషాభిమానులు ముందుకు వచ్చారు. తెలుగు బోధనా భాషగా చేయాలని గొంతెత్తారు. ఆ కారణంగా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖను నెలకొల్పారు. శాఖాధ్యక్షులుగా రాయప్రోలు సుబ్బారావుగారిని నియ మించారు. తెలుగు భాషకు ఊపిరి వచ్చింది. కురుగంటి సీతారామ భట్టాచార్యులు ప్రాపకం కోసం 'ఆదర్శ ప్రభువు' అను పుస్తకాన్ని రచించి నిజాం మన్ననలు పొందారు. తెలుగు శాఖ ఏర్పడిన తరువాత ప్రథమ విద్యార్థిగా ఎం.ఏ లో చేరారు. పల్లా దుర్గయ్యగారు పి.హెచ్.డి కూడా చేవారు. 'గంగిరెద్దు' కావ్యాన్ని రాశారు.

ఒక విశేషం ఏమంటే గ్వాలియరు మహారాజు నిజాంకు ఒక టన్ను వెన్న పంపాడు. అది నిలవ ఉన్నది. వాసన వస్తూంది. ప్రజల కంటగడితే ప్రాణాలు తీస్తారని కొత్వాల్ వెంకటరెడ్డి దానిని మూసీనదిలో పార బోయించాడు. ఆ వెన్న ఖరీదు కట్టి డబ్బు మూట రాజు చేతికందిచ్చాడు. కొత్వాలు నష్టపడ్డాడు. రాజు లాభం పొందాడు. తెలుగు ప్రజల్లో చైతన్యం వచ్చింది. ఆంధ్ర మహాసభ ఏర్పాటయ్యింది. చేయవలసిన పనులను నాయకులు సదస్సుల్లో చెప్పేవారు. వారీ ప్రయత్నాల్లో ఉండగా నిజాం కాశింరజ్వీని దగ్గరకు చేర్చుకొన్నాడు. చేయరాని పనులు చెప్పాడు. రజ్వీ రంగంలోకి దిగాడు. రజాకార్లను చేకూర్చుకొన్నాడు. తెలుగు ప్రజలపై పడ్డారు. ఘోరమైన పనులు చేశారు. హతమార్చాడు. స్త్రీలను చెరచాడు. ఇంకా నలుమూలల తెలుగువారిపై దాష్టీకం చేయించాడు రజ్వీ. నిజాం పై వ్యతిరేకత కల్గింది. అందరూ ముందుకువచ్చారు. రజాకార్లను ఎదుర్కొన్నారు. సర్కారు పోలీసులు చేతులు ముడుచుకొని కూర్చొన్నారు. ప్రజాబలం ముందు ఎవ్వరూ ముందుకు రాలేకపోయారు.

ఆ రోజుల్లో నిజాం వ్యతిరేకులను జైళ్లపాలు చేశారు. వసతి సౌకర్యాలు మాటెత్తకూడదు. సరైన కూడు పెట్టేవారు కాదు. దాహం తీర్చుకోవాలంటే నీళ్లు అందించే వారు కాదు. పోలీసు చర్య తరువాత మార్పు వచ్చింది. జె.యన్.చౌదరి మిలటరీ గవర్నరుగా 18.9.48 నియమించారు. నిజాం దాసోహం . రజ్వీ-రజాకార్లు పారిపోయారు. మిలటరీ పాలనతో సంస్కరణలు చేశారు. అందరూ హాయిగా ఉన్నారు. ప్రజలు ఊరూర సంబరాలు చేసికొన్నారు. తెలుగు బోధనా భాషగా అవతరించింది. సంస్థానాలు తెలుగు భాషకు ప్రాధాన్యమిచ్చి అభివృద్ధికే పాటుపడ్డారు. పటేలు, పట్వారీలు, దొరలు, దొరసానులు మాయమయ్యారు. ఆంధ్రప్రాంతంలో కమ్యూనిస్టులపై దమనకాండ మొదలైంది. ఇంటిలో వస్తువులను చిందరవందర చేశారు. జంధ్యదారులను జంధ్యాలు తీసి నోటికి కళ్లెంగా పెట్టి ప్రతాపం చూపించారు. కాటూరు, ఎలమర్రు వంటి గ్రామాల్లో కమ్యూనిస్టులను గాంధీ విగ్రహాల చుట్టూ నడిపించారు. కొంతమందిని దేవాలయాలకు తీసికొని వెళ్లి గన్నేరు బెత్తాలతో కొట్టారు. వాతలు తేలితే వారే అమృతాంజనం తెప్పించి బొబ్బలు లేచిన చోట్ల రాశారు. ఇదంతా పటేలు చేయించాడు. సైనికాధికారిగా పళయ నప్పన్. మలబారు పోలీసుల చేత ఈ రాక్షసత్వం కలిగించాడు. ప్రధాన కమ్యూనిస్టు నాయకులు అడవుల్లోకి వెళ్లి ఏ రోజు సమాచారం ఆరోజు తెలిసికొని స్థావరం మార్చేవారు.

'రాజకీయాలు రొచ్చు. అది ధనబలం, కండబలం ఉన్నవారి విలాసం. దేశభక్తికి మేం అన్నదమ్ములం గుల్ల అయిపోయాం. అది మాకు తిండి పెట్టలేదు. కాబట్టి రాజకీయాలకు పోవద్దని మా పిల్లలకు తొలి నుంచి చెబుతూనే ఉన్నాం. మగపిల్లలు మాతో చర్చించారు వినలేదు' అన్నారు దాశరథి రంగాచార్య. సోదరులు ముమ్మరంగా రాజకీయాల్లో పాల్గొన్నారు. అధికారులు ఇబ్బంది పెట్టారు, పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నారు. జైలు పాలయ్యారు. భార్యపిల్లలు ఏమయ్యారో తెలిసేది కాదు. నానావిధాలుగా జీవితం పురోగతి సాధించలేకపోయినా హైద్రాబాదు ఆంధ్రులకు రాజధాని అయినందున యావన్మంది సంతోషించారు. నిజాం వెళ్లిపోయినా వారు నిర్మించిన భవనాలు కళాకాంతులతో వర్ధిల్లుతూనే ఉన్నాయి.

దాశరథి రంగాచార్యులు 1928 వ సంవత్సరం విభవ నామ సంవత్సరం సంవత్సర అధిక శ్రావణ శుక్ల సప్తమీ మంగళవారం ఉదయం 5 గంటలకు పుట్టారు. చుట్టుపక్కల వారు సంతోషించారు. బి.ఏ వరకు చదివారు. అష్టకష్టాలుపడి ఉదరపోషణ నిమిత్తం రక రకాల ఉద్యోగాలు చేశారు. ఎవరు ఎక్కువ వేతనం ఇస్తే అక్కడ పనిచేయటం మొదలుపెట్టారు. తోటివారు ఉద్యమాల్లో పాల్గొన్నారు. మరికొందరు అసువులు బాసారు. గత స్మృతులు చెప్పుకొని అనుభూతిలో లీన మయ్యేవారు. వారు చిల్లర దేవుళ్లు, వేంకటేశ్వర మహత్మ్యము, మోదుగుపూలు, జనపదం, మాయ జలతారు, శరతల్పం, రామాయణం, భారతం, భాగవతం, నాలుగు వేదాలు ఆంధ్రీకరించటం రణభేరి, రణరంగం, మానవత మున్నగు రచనలు వారి కలం నుండి జాలువారాయి. 'జీవనయానం' వారి యావజ్జీవిత ప్రతిబింబం.

తండ్రితో తగవులాట, అన్న దాశరథి తండ్రి భుజంపై కొట్టటం, తల్లిని మాటమాటికి కొట్టటం, భార్యాబిడ్డలను వదలి వేరొక వివాహం చేసుకొనటం వంటి ఘటనలు వారి జీవిత కాలంలో జరిగాయి. వారి మాటల్లో రహస్యం లేదు. అంతా బహిర్గతం. ఏ విషయాన్ని మనసులో దాచుకోలేదు. వారు చెప్పవలసిన జీవితాన్ని కనుమరుగు కానీయలేదు. అయ్యో అంతా వీరితో చెప్పానే అనే శంక లేదు. వారిది నిండైన మనసు. నవ్యనవనీత సమానం. అవసరం కలిగితే పలుకులు వజ్రాయుధమే.

"అంతులేనిది ఈ జీవనయానం.
ఎంతకని చెప్పటం
ముగింతాం ఇంతటితో" అంతా సుఖించాలి. అంతా వ్యాధి రహితులు కావాలి. అంతా శుభంగానే చూడాలి. ఏ ఒక్కడూ దుఃఖ భాజనుడు కారాదు" అని వారి కచ్చితాభిప్రాయం.

అడిగోపుల వడి కైతల భేరి

గ్రంథ సమీక్ష

సుధామ, సెల్: 9849297958

అభ్యుదయపు వడి దాపుల నిలిచి అడిగోపుల వెంకటరత్నం నాలుగు దశాబ్దాలకు పైగా కవిత్వం వెలువరిస్తున్నారు. 1984 లో 'సూర్యోదయం' కవితా సంపుటి నుండి, తాజాగా 2021 కవితా సంపుటి 'జయభేరి' వరకూ పాతిక పైచిలుకు కవితా సంపుటులు వెలువరించిన వెంకటరత్నం కవిగా నిరంతరం 'ముందడుగు' వేస్తున్నారు. 'కాలం నా చేతిలో ఉంది' అనే ఆత్మవిశ్వాసంతో 'జీవన పోరాటం' చేస్తూ సాహిత్యలోక 'మహాపథం' లో సాగుతున్నవారు. సమాజంలో ఎప్పటికప్పుడు జరుగుతున్న సందర్భాలను ఒడిసి పట్టుకుని, ఆ సంక్షోభాలను, ఆ బాధితులను తనదైన భావుకతతో విశ్లేషిస్తూ, ఆసరాతో ఆలోచింపచేస్తూ సామాజిక స్పృహతో రాస్తున్న కవి గనుక -తన కవిత్వంలో ఆక్రోశం, ఆవేశం రెండూ ఉంటాయి. వైయక్తిక ఇతివృత్తాలనిపంచే వాటిని కూడా ఒక చారిత్రక, సాంఘిక, రాజకీయఅంశాల భిత్తికపై ప్రేరణాత్మకంగా మలుచుకోవడం ఆయనకు తెలుసు. అయితే తన కవిత్వ ప్రయోజనం నుండి ఇసుమంతయినా దారి తప్పని కవి అడిగోపుల. ప్రచారార్భటులు, కీర్తికాముకతలు వంటబట్టని కవి కనుక నిఖార్సుగా, నిజాయితీగా నిరాడంబరంగా ఉంటూ సాగిపోతూంటాడు.

సామాజిక రుగ్మతలపై పదునైన తన కలాన్ని ఎక్కుపెట్టే కవి తాను. 'అన్ని గుండెలు ఎరుపు రంగులో ఉన్న ఎరుపెక్కేది కొన్ని గుండెలే' నని అధోజగత్సహోదరుల పక్షాన ఉండే వామపక్ష భావ సంచయం మెండుగా ఉన్న కవి అడిగోపుల. 'బతికుండగానే ప్రతిభకు చనిపోయాక శవానికి సమాధులు కట్టే వ్యవస్థలో'' ఈ కవికి రావలసినంత గుర్తింపు రాలేదనే అనిపిస్తుంది. నిద్రపోతున్నా సూర్యుడిని తలదిండుగా పెట్టుకునే చేతనత్వం, చీకటిపై సమరశంఖం పూరించి సదా ఆశావహ దృక్పథాన్ని ప్రోదు కొలిపే వాడీకవి. తానూ సందేశం ఇస్తాడుగానీ అదేదో నినాదప్రాయంగా ఉండదు. ఆ సందేశంలో ఓ ఆదేశం స్ఫురిస్తుంది. వృత్తిరీత్యా ఇంజనీర్ అయిన అడిగోపుల కవితా నిర్మాణ సంవిధానం కూడా ఒక సిస్టమాటిక్ రీతిలో ఉంటుంది. ప్రాంతీయ సమస్యల నుండి అంతర్జాతీయ సమస్యల వరకూ ఏది కవితా వస్తువుగా స్వీకరించినా అది వైయక్తిక విశ్లేషణతో ఒక సామాజిక అవగాహనను కల్గించే రీతిగా అభివ్యక్తీకరించడమౌతుంది.

ఇంటలెక్చువల్ అండ్ ఎమోషనల్ కాంప్లెక్స్‌ను సద్యస్ఫూర్తితో తన భావ చిత్రాలతో ఏకోన్ముఖం చేసి చూపడం తన కవితల్లో గమనించగలం. కేవలం మార్మికతనో తాత్వికతనో ఆశ్రయించక అర్థమయ్యే మాటలతోనే సమర్థవంతమైన కవిత నిర్మించడం తానెరిగిన విద్య. ఒక సాంద్రత, గాఢత మాత్రం కుంటుపడకుండా తాను చెప్పదలచిన దానిని కవిత్వీకరించగల విన్నాణం తానెరుగును. 'జయభేరి' సంపుటిలో 'అదే చరిత్ర' లగాయితు 'కథ కంచికి చేరదు' వరకూ మొత్తం యాభై ఏడు కవితలున్నాయి. ప్రపంచం ఒక పరీక్షా కేంద్రం అయినా 'మానవుడే విజేత' అంటూ 'శిల్పించిన వర్తమానం' ఈ సంపుటి. సమాజంలో ఎన్ని వైరుధ్యాలు, వైవిధ్యాలు ఉన్నా ఒక ఏకత్రిత నిలుపుకోవలసిన అగత్యం నిర్ద్వంద్వంగా చెబుతాడు. అందుకే 'చేతివేళ్లు సమాజానికి ప్రతిరూపాలు/ సరి సమానంగా లేని వేళ్లు/ ఆర్థిక సామాజిక అసమానతలకు/ ప్రతిబింబాలు/ అలాగని కలహించుకోవు/ వేర్పాటువాదం లేదు/ కర్తవ్య నిర్వహణలో/ మహా సమాజ నిర్మాణంలో/ అంతా కలిసికట్టే!" అంటాడు (హస్తాక్షరు)

'వేళ్లు మోడులు కావు చిగురిస్తూ ఉంటాయి-వాటికి అలంకారాలు తెలుసు- అంగుళీయకాలు ధరిస్తుంటాయి- వాటికి బాధ్యతలు తెలుసు అందుకే చూపుడు వేళ్లవుతాయి" అనడంలో వేలు లాగా మనుషులు వేనవేలుగా ప్రవర్తిల్లాల్సిన తీరును సూచిస్తున్నాడు. ఒక్కోసారి ప్రకృతి కూడా సామాన్యుడికి సహకరించదు. పల్లెలో నెర్రెలిడిన చేలుబీళ్లుంటే వాన పల్లెలోకాక నగరంలో కురవడం చిన్నచూపే కదా!

వర్షం బట్ట తడిపినా/ వొంటిని పిండి/ ఎండిన పొలం/ తడి చేస్తాడు రైతుఅనడంలో రైతుఘనతను అద్భుతంగా రూపు కట్టించడం కానవస్తుంది. నా నరకం నాది కాదు/ ఎదుటివాడి అర్పణం/ వాడి స్వర్గంవాడిది కాదు/ నా స్వార్జితం! అనడంలోనే వర్గ స్పృహ ద్యోతకపరచడం విశేషం! 'కథానాయకుడు' అనే కవితలో ఓ చోట 'మొత్తం భూమిని గురించి ప్రబంధాలు తెచ్చిన వాళ్లు లేరు' అనేది సంశయాస్పద మైనదయినా తానే వెంటనే- సూర్యుడు న్నాడుగా-/ సూర్యచంద్రుల రచనలు/ సమాప్తంగాని సశేషాలు రోజూ రాస్తూనే ఉన్నారు/ పుంఖాను పుంఖాలుగా అనడం, ప్రకృతే స్వయంగా కృతికర్తగా సంభవించడం సబబుగాఉంది. 'జయభేరి' కవితలో మట్టిలో పుట్టిన మనిషి/ మట్టిని జయిస్తాడు/ మనిషికి బలమౌతడు/ మట్టినిజయించిన మనిషి/ మట్టిలో కలుస్తాడు!/ నోట్లో మట్టిగొట్టే/ వ్యాపారుల్ని/ రాజకీయ నాయకుల్ని/ మట్టి కరిపిస్తాడు! అనే భావననే జయభేరిగా రూపుకట్టించడం విశేషం! 'ధర్మం నాలుగు పాదాలైతే' అన్న కవితలో కవి అన్నట్లుగానే 'పడకట్టగా పడకట్టగా / సాహితీ సామ్రాజ్యానికి కొన్ని/ మణిమయ మకుటాలౌతాయి" నిజానికి అడిగోపుల వెంకటరత్నం సామాజిక కవితా సామ్రాజ్యానికి అలాంటి ఒక మణిమయమకుటమే!



జయభేరి (కవిత్వం)- అడిగోపుల వెంకటరత్నం
మల్లెతీగ ముద్రణలు, కావేరి రెసిడెన్సీ
అరబిందోమార్గ్- ఎన్.జి.ఓ.కాలనీ,
తిరుపతి-517501, వెల: రూ100/-

స్వీకారం



మోదీ 'భార'తం (26 మే 2014-25 మే 2022)
హిందూత్వ రాజకీయం-ఉపశ్రేణుల ప్రతిఘటన
(ప్రత్యేక వ్యాసాల సంచిక)
ప్రధాన సంపాదకులు: డి.వి.వి.యస్. వర్మ
సంపాదకవర్గం: మందలపర్తి కిషోర్, కొప్పర్తి వెంకటరమణ మూర్తి,
డి.సోమసుందర్, బి. రమేష్‌చంద్రబాబు
వెల: రూ. 30/-, పేజీలు : 76
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ మరియు నవచేతన,
ప్రజాశక్తి, నవతెలంగాణ బుక్‌హౌస్‌లు

నిశిత దృష్టితో కవిత్వ సృష్టి

కవిత్వం దృష్టి అనే కెలైడోస్కోపుతో జీవితం మూలాల్ని వెదికి పట్టుకుంటూ మనకు కనిపించని ఎన్నో దృశ్యాల్ని మనముందు నిరంతరం సాక్షాత్కరింపజేస్తూ తన విశ్వవ్యాపక దృష్టిని చాటుకుంటూ మనతో అనుబంధాన్ని పెంచుకుంటూవుంటుంది. మనం వినని సరికొత్త రాగాలను మీటుతూ వుంటుంది. అప్పుడు మనం సెలయేటి అడుగున దాగి సవ్వడిచేసే గులకరాళ్ల శబ్దాలనూ వినగలుగుతాం. కరిగిపోయే మబ్బుల కన్నీటి వర్షాన్నీ చూడగలుగుతాం. వాసంత గీతాలాపన చేసే కొమ్మల్లోని పూల దరహాసాల్నీ ఆస్వాదించ గలుగుతాం. అవును...కవిత్వ దృష్టి అంత సూక్ష్మమైనది. మానవ జీవిత హర్మ్యాలను ఛేదించే ఈ కవిత్వదృష్టి ఎంతో నిశితమైనది. ఎంతో గాఢమైనది. ఎంతో విశాలమైనది. అది బిందువులో సింధువును చూపుతుంది. బతుకు సంధిట్లో వొదిగే బాధల గాథల్ని ఎక్సరే తీస్తుంది. జీవన వాకిట్లో తొలివేకువ కిరణమై వాలుతుంది. ప్రకృతిలో మమేకమై కవితాత్మకు సుందరమైన, సుమధురమైన ఆకృతినిస్తుంది. ప్రకృతి అందాలను మానవ జీవితాల్లో సంలీనం చేస్తుంది.

'ఆవులిస్తున్న నవనాగరికుడి
అధిరోష్టం మీద వాలిన చినుకు
మధువు వాసనవేసి కాబోలు
మైమరచి తైతక్కలాడింది
కిటికీలోని మందుసీసాలో పడిన చినుకు
చేదెక్కి శరీరమంతా
ఏ కమ్మని పల్లెటూరి చెరువులో పడక
నగరానికెందుకొచ్చానని నాలుక కొరుక్కుంది'

('నగరంలో వాన' నుంచి)

అంటాడు వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయులు. నగరంలో వాన కురవడం సాధారణం. అయితే ఆ వానను వీక్షించే కవి దృష్టి అసాధారణం. వాన చినుకుల్లో నగర జీవితాన్ని అవలోకించాడు. తానే వాన చినుకై విభిన్న నగర దృశ్యాలను స్పృశించాడు. కవి వానచినుకులో మధ్యతరగతి దృశ్యాన్ని చొప్పిస్తూనే, నవనాగరికతా నృత్యాన్ని కన్నులారా వీక్షిస్తూనే, పల్లెటూరి చెరువులో పడితే సార్థకమవుతుందన్న చినుకు జీవిత పరమార్థాన్నీ వివరించాడు. జీవితాల్ని ఆత్మీయంగా పెనవేసుకొని అనునిత్యం కాపాడే వాన ఆ జీవితాన్ని ప్రతిబింబించే కవిత్వానికి ఆత్మీయ ఆలంబన అయింది.

'కలత నిద్దరోయే చెరువుల
కళ్లు తెరిపించి
చేతులెత్తేసిన చెట్లకు
కర్తవ్యం బోధించే వాన'

('వర్షాల్లో కాలేజీ' ఖండిక నుంచి)

అంటాడు అనుభూతి కవి ఇస్మాయిల్. అంతఃదృష్టి ద్వారా ప్రకృతికీ, మనిషికీ ఏకకాలంలో కర్తవ్యాన్ని బోధిస్తున్నాడు కవి. కర్తవ్యమనే వానతో నిద్రపోయే చెరువులను తట్టిలేపుతూ నీళ్లతో కళకళలాడమంటూనే, మోడైపోయిన చెట్లను వానచినుకుల సరాగాలతో పల్లవించమంటూనే జడత్వపు పొరల్లో కూరుకుపోయిన మనిషి హృదయాన్ని జాగరూకపరుస్తున్నాడు కవి. మనిషి జీవితానికి కర్తవ్యాన్ని బోధించేందుకు చెట్టు కవిత్వానికి వాహిక అయింది. అందుకే చెట్టు విశ్వజనీన ప్రతీక అయింది. అనునిత్యం జరిగే హృదయమథనంలోంచి అమృతంలా ఆవిర్భవిస్తుంది కవి దృష్టి. అది గుండెపొరల్ని అలవోకగా స్పృశిస్తూ చెండు మల్లెలుగా మలుస్తుంది. కవి దృష్టి అనిర్వచనీయం.



-డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, సెల్: 9177732414

మా వాళ్లకు బీజేపీ ఎర

- రాజ్యసభ ఎన్నికల నడుమ ఏసీబీకి కాంగ్రెస్ ఫిర్యాదు
- అసంతృప్త ఎమ్మెల్యేలతో ఉదయపూర్ చేరుకున్న సీఎం గెహ్లాట్

జైపూర్ : రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ తమ ఎమ్మెల్యేలకు ఎర వేస్తోందని, వారిని ప్రలోభాలకు గురి చేస్తోందని రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు ఆదివారం ప్రతిపక్ష బీజేపీపై అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ) కి ఫిర్యాదు చేసింది. కొన్ని సమస్యలపై ఆగ్రహంతో ఉన్న ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఆదివారం ఉదయ్‌పూర్ చేరుకున్నారు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో 'హార్స్ ట్రేడింగ్' జరుగుతుందన్న భయం నడుమ వారిని ఇక్కడ ఒక హోటల్‌లో ఉంచారు. రాష్ట్రంలోని నాలుగు రాజ్యసభ స్థానాలకు జూన్ 10న ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్‌కు రెండు స్థానాలు దక్కనుండగా, మూడో స్థానంలో గెలవాలంటే స్వతంత్ర ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల శాసనసభ్యుల మద్దతు అవసరం. ముఖ్యమంత్రితో పాటు ఉదయపూర్‌కు వెళ్లిన ఆరుగురు ఎమ్మెల్యేలలో 2019లో బీఎస్‌పీ నుంచి కాంగ్రెస్‌ను సమర్థించిన వారు కూడా ఉన్నారు. అంతకుముందు శనివారం రాత్రి, ఎమ్మెల్యేలు గెహ్లాట్‌ను జైపూర్‌లోని ఆయన నివాసంలో కలుసుకుని చర్చలు జరిపినట్లు పార్టీ వర్గాలు ఆదివారం తెలిపాయి. గెహ్లాట్‌ను కలిసిన ఆరుగురు ఎమ్మెల్యేల్లో బీఎస్‌పీ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన రాజేంద్ర గుడ, సందీప్ యాదవ్, వాజీబ్ అలీ, లఖన్ మీనా ఉన్నారు. మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు గిర్రాజ్ సింగ్ మలింగ, ఖిలాడీ లాల్ బైర్వా. ఉదయ్‌పూర్ చేరుకున్న తర్వాత గెహ్లాట్ దబోక్ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ 2020లో రాజకీయ సంక్షోభం సమయంలో ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారని చెప్పారు. 'రాజకీయ సంక్షోభం ఏర్పడినప్పుడు, రాష్ట్రంలో ఎటువంటి షరతులు లేకుండా సుస్థిర ప్రభుత్వాన్ని అందించాలని బీఎస్‌పీ టికెట్ పొందిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వారు మాకు మద్దతు ఇచ్చారు. రాజ్యసభ ఎన్నికల్లో ఇప్పుడు వారు తమకు మద్దతు ఇస్తారని బీజేపీ ఎలా ఆశించగలదు? అని గెహ్లాట్ ప్రశ్నించారు. వారి సమస్యలు 'చిన్నవి' అని గెహ్లాట్ చెప్పారు. 'మేము ఐక్యంగా ఉన్నాం. రాజ్యసభ ఎన్నికల్లో మేము మూడు సీట్లు గెలుస్తాం. ఈసారి కూడా బీజేపీ ఎర వేసే ప్రణాళికలను విఫలం చేస్తాం' అని ఉద్ఘాటించారు. స్వతంత్ర అభ్యర్థి ఎలా ఓట్లు పొందబోతున్నారని ప్రశ్నించగా, 'హార్స్ ట్రేడింగ్ చేసే అవకాశం ఉందని అన్నారు. అంతకుముందు, రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ చీఫ్ విప్ మహేష్ జోషి మాట్లాడుతూ 'హార్స్ ట్రేడింగ్‌కి అవకాశాలు ఉన్నాయని' ఏసీబీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. అందువల్ల అటువంటి విఫల ప్రయత్నాలు చేయడానికి నేను ఏసీబీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాను' అని జోషి చెప్పారు. అవసరమైతే ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేస్తానని, ఫిర్యాదులో తాను ఏ వ్యక్తి పేరును పేర్కొనలేదని, అయితే అవినీతి నిరోధక సంస్థ అప్రమత్తంగా ఉండేందుకే దానిని సమర్పించామని వివరించారు. అవినీతిలో లంచం ఇచ్చేవారు, తీసుకునేవారు ఇద్దరూ దోషులేనని, ఎలాంటి అవినీతిని సహించబోమని, హార్స్ ట్రేడింగ్ జరగనివ్వబోమని తెలిపారు.

ఒక అధికారిక అభ్యర్థిని నిలబెట్టడమే కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మీడియా బారన్ సుభాష్ చంద్రకు మద్దతు ఇస్తున్న బీజేపీ వేటకు భయపడి ఎమ్మెల్యేలను ఉదయ్‌పూర్‌కు తరలించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ముకుల్ వాస్నిక్, ప్రమోద్ తివారీ, రణదీప్ సింగ్ సూర్జేవాలాను కాంగ్రెస్ ఎన్నికల బరిలోకి దింపింది. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ తన శాసన సభ్యులను హోటల్‌కి తరలించడం ఇదే తొలిసారి కాదు. 2020లో రాజ్యసభ ఎన్నికలకు ముందు పార్టీ నాయకుడు సచిన్ పైలట్, అతనికి సన్నిహితంగా ఉన్న 18 మంది ఎమ్మెల్యేల తిరుగుబాటు కారణంగా రాజకీయ సంక్షోభం ఏర్పడినపుడు, కాంగ్రెస్ పార్టీ తన ఎమ్మెల్యేలను హోటల్‌లో ఉంచింది. ఇదిలాఉండగా, సుభాష్ చంద్ర నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన నేపథ్యంలో బీజేపీ ప్రలోభాలకు తెర తీస్తుందని గెహ్లాట్ అంతకుముందు ఆరోపించారు.

రాష్ట్ర అసెంబ్లీలో 108 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ నాలుగు సీట్లలో రెండింటిని గెలుచుకోవడం ఖాయమని గెహ్లాట్ అన్నారు. రెండు సీట్లు గెలిచిన తర్వాత, కాంగ్రెస్‌కు 26 మిగులు ఓట్లు వస్తాయి. మూడవ సీటు గెలుచుకోవడానికి అవసరమైన 41 కంటే 15 తక్కువ. మరోవైపు, రాష్ట్ర అసెంబ్లీలో బీజేపీకి 71 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక సీటును గెలుచుకోవడం ఖాయం, ఆ తర్వాత అది 30 మిగులు ఓట్లతో మిగిలిపోతుంది.

ఖతార్ పర్యటనలో ఉప రాష్ట్రపతి వెంకయ్య

ఆ దేశ ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు

దోహా : మూడు రోజుల విదేశీ పర్యటనల్లో భాగంగా భారత ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు ఆదివారం ఖతార్ ప్రధాన మంత్రి షేక్ ఖలీద్ బిన్ ఖలీఫా బిన్ అబ్దుల్ అజీజ్ అల్ థానీతో సమావేశమయ్యారు. శనివారం దోహా విమానాశ్రయానికి చేరుకున్న ఆయనను సాదరంగా ఆహ్వానించినట్టు ఖతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ తెలిపారు. ఇరు దేశాలకు సంబంధించిన ద్వైపాక్షిక చర్చల్లో వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత తదితర సంబంధాలపై ఇరువురి నేతల మధ్య చర్చలు జరిగినట్టు ట్వీట్ చేశారు. ఈ పర్యటనలో భాగంగా వెంకయ్య నాయుడు సోమవారం ఖతార్‌కు చెందిన వివిధ రంగాల ప్రముఖులను కలువనున్నారని పేర్కొన్నారు. సోమవారం జరిగే బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలోనూ ఆయన ప్రసంగిస్తారని పేర్కొన్నారు. భారత్, ఖతార్ మధ్య ఎంతో కాలంగా చారిత్రక సంబంధాలున్నాయని, ఈ నేపథ్యంలోనే 7.5 లక్షల మంది భారతీయులకు తమ దేశం వేదిక అయ్యిందని రెండు రోజుల కిందట ఖతార్ ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో తెలపింది. ఆర్థిక, ఇంధనం, విద్య, పెట్టుబడులు, రక్షణ, సాంస్కృతిక రంగాల్లో ఇరుదేశాలు అభివృద్ధి చెందినట్టు పేర్కొంది. ఇదిలా ఉండగా ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ప్రారంభమై 50 ఏళ్లు కావస్తున్న దశలో ఉపరాష్ట్రపతి వెంకయ్య ఈ పర్యటన చేపట్టినట్టు తెలుస్తోంది.

మొక్కలు నాటిన ఈసీ

న్యూఢిల్లీ: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు ఆదివారం మొక్కలు నాటారు. ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం) ప్రాంగణంలో ఎన్నికల కమిషనర్ అనుప్ చంద్ర పాండే, సెక్రటరీ జనరల్ ఉమేష్ సిన్హా, డైరెక్టర్ జనరల్ ధర్మేంద్ర శర్మ మరియు ఈసీ ఇతర అధికారులు మొక్కలు నాటారు. ఐఐఐడీఈఎం అనేది ఎలక్షన్ కమిషన్ శిక్షణా విభాగం. ఎన్నికల సమయంలో రాష్ట్రాల్లో పోల్ ప్యానెల్, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లు తీసుకున్న వివిధ పర్యావరణ అనుకూల కార్యక్రమాలపై ఒక బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ పాండే ప్రసంగిస్తూ, 'తగ్గించడం, పునర్వినియోగం, రీసైకిల్ అనేవి పర్యావరణానికి అనుకూలమైన ఎన్నికల సంఘం నినాదం. ప్రభుత్వం నోటిఫై చేసిన ప్లాస్టిక్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘాలను ఆదేశించింది. ఫ్లెక్స్, కరపత్రాలు, బ్యాగ్‌లు వంటి ప్రచార సామగ్రి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా , సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బృందాలను కోరింది.

తదుపరి సీఎం సీటు మాదే: ఎన్‌సీపీ

ఔరంగాబాద్: శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీకి చెందినవారే మహారాష్ట్రకు తదుపరి ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ నేత ధనంజయ్ ముండే పేర్కొన్నారు. పర్భాని నగరంలో జరిగిన బహిరంగ సభలో ముండే మాట్లాడుతూ... శివసేన నేతృత్వంలోని ఎంవీఏ ప్రభుత్వంలో తన కృషి వల్ల సామాజిక న్యాయ శాఖ ప్రతిష్ఠాత్మకంగా మారిందని అన్నారు. 'సామాజిక న్యాయ శాఖను ఎవరికి అప్పగిస్తారనే ప్రశ్న రేపు తలెత్తితే... కాబోయే ముఖ్యమంత్రి ఎవరైతేనేం, సీఎం పది కూడా మా (ఎన్‌సీపీ)దే... సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ మా (ఎన్‌సీపీ) వద్దనే ఉంటుంది... ఈ శాఖ చాలా పేరు ప్రఖ్యాతులు సంపాదించింది' అని ముండే అన్నారు. గడచిన రెండున్నరేళ్లుగా ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని ప్రభుత్వంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) కీలకంగా ఉంది. గతంలో తాను మహారాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేతగా సమర్థంగా పనిచేశానని ముండే చెప్పారు. డెప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని ఆర్థికశాఖ, హోంశాఖతో పాటు ప్రభుత్వంలో ఎన్‌సీపీ మూడు ప్రధాన మంత్రిత్వశాఖలను కలిగిఉంది.

ఫుడ్ డెలివరీ ఏజెంట్‌ను కొట్టిన కానిస్టేబుల్ అరెస్ట్

కోయంబత్తూరు: ఫుడ్ డెలివరీ ఏజెంట్‌ను చెప్పుతో కొట్టిన ట్రాఫిక్ పోలీసు కానిస్టేబుల్‌ను అరెస్టు చేసి సస్పెన్షన్‌లో ఉంచినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఫుడ్ డెలివరీ ఏజెంట్ మోహనసుందరం ఫిర్యాదుతో ఘటనకు సంబంధించి వైరల్‌గా వీడియో క్లిప్ ఆధారంగా కానిస్టేబుల్ సతీశ్‌ను అరెస్టు చేసి విధులనుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం అవినాశి రోడ్డులోని ట్రాఫిక్ జంక్షన్ వద్ద కానిస్టేబుల్ సతీశ్, మోహనసుందరాన్ని చెప్పుతో కొట్టడం వీడియో క్లిప్‌లో కనిపించింది. కాగా, మోహనసుందరాన్ని స్వయంగా ఫోన్‌లో సంప్రదించి కానిస్టేబుల్‌పై తీసుకున్న చర్యలను తెలియజేసినట్లు తమిళనాడు డీజీపీ శైలేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెంట్ బాగోగులను ఆయన అడిగి తెలుసుకున్నారు. డెలివరీ ఏజెంట్‌పై భౌతిక దాడి ఘటనపై విచారణ జరుగుతోంది. నిందితుడైన పోలీసుపై క్రిమినల్, శాఖాపరమైన చర్యలు ప్రారంభించినట్లు డీజీపీ ప్రకటనలో వివరించారు.

మధ్యప్రదేశ్‌లో భోజనం వికటించి 12మంది అస్వస్థత

గ్వాలియర్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో ఓ పెళ్లి భోజనం వికటించి 12మంది అస్వస్థతకు గురైనట్టు ఆరోగ్యశాఖాధికారులు ఆదివారం తెలిపారు. బాధితులందరూ పెద్దవారేనని, వారంతా వాంతులు విరోచనాలతో దర్బా పట్టణంలోని సర్వజన ఆస్పత్రికి శనివారం సాయంత్రం చేరుకున్నట్టు గ్వాలియర్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ మనీశ్ శర్మ తెలిపారు. అందరూ పెళ్లి జరిగిన ఛాప్రా గ్రామంలో విందు భోనం చేశారని చెప్పారు. వారందరికీ చికిత్స చేస్తున్నామని, ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఇదే పెళ్లి వేడుకలో పాల్గొని తీవ్ర అస్వస్థత కు గురైన మరో వ్యక్తి కోసం కొంతమంది ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామానికి వెళ్లారు.

కిష్త్వార్‌లో ఉగ్రవాది అరెస్టు

జమ్ము: జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో ఆరేళ్లుగా క్రియాశీలకంగా పనిచేస్తున్న హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదిని ఆదివారం అరెస్టు చేసినట్లు అధికారి ఒకరు తెలిపారు. పోలీసులు, రాష్ట్రీయ రైఫిల్స్, సీఆర్పీఎఫ్ సంయుక్త ఆపరేషన్‌లో నాగసేని తహసీల్‌లోని రాష్గ్వారీ నివాసి తాలిబ్ హుస్సేన్‌ను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదిని అరెస్టు చేయడం హిజ్బుల్ ముజాహిదీన్‌కు, జిల్లాలో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించే దాని ప్రణాళికకు "పెద్ద దెబ్బ" అని పేర్కొన్న అధికారి, అతను 2016లో మిలిటెన్సీలో చేరాడని, నిషేధించబడిన ర్యాంక్‌లలోకి యువకులను రిక్రూట్ చేయడం ద్వారా చురుకుగా పనిచేస్తున్నాడన్నారు. అతని ఆచూకీ గురించి లభించిన లీడ్స్‌పై పోలీసులు నిశితంగా పనిచేశారని, అతడిని అరెస్టు చేయడం ద్వారా ఆ ప్రాంతంలో మిలిటెన్సీని పునరుజ్జీవింపజేసేందుకు తన ఎత్తుగడను ముందే ప్రారంభించారని ఆయన అన్నారు. క్షిత్వార్ పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

పోలీసులను నివేదిక కోరిన ఎస్సీ, ఎస్టీ కమిషన్

కాయంకుళం/తిరువనంతపురం: రాష్ట్రంలోని అలప్పుజ జిల్లా, హరిపాడ్ ప్రాంతంలోని దళిత కాలనీలో పోలీసు అధికారి అక్రమంగా ఇళ్లలోకి ప్రవేశించి కుల దురభిమానానికి పాల్పడ్డారనే స్థానికుల ఫిర్యాదు మేరకు కేరళ రాష్ట్ర ఎస్సీ/ఎస్టీ కమిషన్ ఆదివారం పోలీసులను నివేదిక కోరింది. కమిషన్ ఛైర్మన్ బీఎస్ మావోజీ మాట్లాడుతూ పోలీసు చర్యను "హై హ్యాండ్" అని అభివర్ణించారు. ఈ సంఘటనకు సంబంధించి అలప్పుజా ఎస్పీ నుంచి నివేదికను కోరినట్లు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి వచ్చిన వార్తాకథనాల ఆధారంగా కమిషన్ స్వయంగా విచారణ చేపట్టిందన్నారు. పోలీసులు అక్రమంగా దాడులు చేశారని, అక్కడి వ్యక్తులపై కులపరమైన వ్యాఖ్యలు చేశారని కాలనీ వాసులు కమిషన్‌ను పిలిపించారని మావోజీ చెప్పారు. జూన్ 4-5 అర్ధరాత్రి తర్వాత ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కాలనీలో సాధారణ పెట్రోలింగ్‌లో ఉన్న అధికారులు ఒక ఇంటి వెలుపల మోటారుబైక్ పక్కన ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉండడాన్ని గమనించి, వారు రాత్రి ఎందుకు అక్కడకు వచ్చారని వారిని ప్రశ్నించారు. వారిని విచారిస్తున్నప్పుడు, కాలనీలోని ఇతర నివాసితులు కూడా బయటకు వచ్చి, పోలీసులు ఇద్దరినీ ప్రశ్నించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారని కరీలకులంగర పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. ఎక్కువ మంది జనం రావడంతో పరిస్థితి చేయిదాటిపోయిందని, స్థానికులు పోలీసు జీపును అడ్డుకున్నారని, దాని తాళం తీసి పోలీసు అధికారులపై కూడా దాడి చేశారని అధికారి తెలిపారు. తదనంతరం, అధికారులను రక్షించడానికి కాయంకుళం డిప్యూటీ ఎస్పీ నేతృత్వంలో మరింత మంది పోలీసు సిబ్బందిని పిలిపించాల్సి వచ్చిందని, వారి విధులను చేయకుండా అధికారులను అడ్డుకున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌పై ఆప్ ఫైర్

న్యూఢిల్లీ: కొత్త లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాపై ఆప్ విరుచుకుపడింది. కేజ్రీవాల్ ప్రభుత్వ పనిలో జోక్యం చేసుకోవడానికి , శాంతిభద్రతల పరిరక్షణకు దూరంగా ఉండటానికే కేంద్రం అతన్ని పంపినట్లుగా కనిపిస్తోందని ఆరోపించింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అతిషి విలేకరులతో మాట్లాడుతూ... సక్సేనా కొద్ది రోజుల క్రితం బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నగరంలో జరిగిన క్రూరమైన నేరాలపై క్రియాశీలకంగా వ్యవహరించలేదని, కానీ ఆయన ఢిల్లీ ప్రభుత్వ పనిలో జోక్యం చేసుకున్నారని ఆరోపించారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, తాను ఎయిర్ కండిషన్డ్ ఆఫీసుల్లో కూర్చునే వ్యక్తిని కాదని, నేలపైనే ఉంటానని చెప్పారని, గత 10 రోజుల్లో దేశ రాజధానిలో అనేక దారుణ నేరాలు జరిగినా ఆయన స్పందించలేదని ఆమె పేర్కొన్నారు. 'మే 27న, సంగం విహార్‌లో ఆటో రిక్షా డ్రైవర్ హత్యకు గురైతే ఆయన సంగం విహార్ పోలీస్ స్టేషన్‌ని సందర్శించారా' అని ఆమె ప్రశ్నించారు. జోర్ బాగ్‌లో ఒక మహిళపై లైంగిక వేధింపులను, ఒక మహిళతో పోలీసు అధికారి ఘర్షణను కూడా అతిషి ప్రస్తావించారు. ఈ కేసులలో గవర్నర్ ఎందుకు కఠినంగా వ్యవహరించలేదని ప్రశ్నించారు. కైలాష్ కాలనీలోని ఓ రెస్టారెంట్‌లో ఇటీవల ఓ మహిళతో ద్వారకా డీసీపీ అనుచితంగా ప్రవర్తించారు. ఈ విషయమై లెఫ్టినెంట్ గవర్నర్ ఢిల్లీ పోలీసు అధికారులందరితో సమావేశాన్ని ఏర్పాటు చేశారా?... చట్టానికి దూరంగా ఉండాలని కేంద్రం ఆయనను కోరినట్లుగా అనిపిస్తోంది. అలాగే కేజ్రీవాల్ నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని ఆదేశం ఇచ్చారు' అని ఆమె విమర్శించారు. ఢిల్లీ ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని కొందరు ఆప్ ఎమ్మెల్యేలు ఆరోపించడంతో గత బుధవారం నుంచి ఆప్, లెఫ్టినెంట్ గవర్నర్ మధ్య వాగ్వాదం మొదలైంది.

కశ్మీర్ హత్యాకాండపై ఆప్ ఆగ్రహం

దిల్లీలో జన్ ఆక్రోశ్ ర్యాలీ

కేంద్రం తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఇటీవల కాలంలో కశ్మీరీ పండిట్లను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరుపుతున్న హత్యాకాండపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. కశ్మీర్‌లోయలో జరుగుతున్న హత్యలకు వ్యతిరేకంగా ఆదివారం దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జన్ ఆక్రోశ్ పేరుతో నిరసన ర్యాలీ నిర్వహించింది. కాశ్మీర్‌లో ఈ పరిస్థితికి కేంద్రంలోని అధికార బీజేపీ వ్యవహార శైలే కారణమని ఆరోపించింది. వందలాది మంది ఆప్ కార్యకర్తలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్న ఈ నిరసనలో కశ్మీరీ పండిట్ల హత్యలను భాతర్ సహించదంటూ రాసిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఒకే వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదులు చేసిన హత్యాకాండకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ కశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాక్ మద్దతిస్తోందని ఆరోపించారు. కాశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో భాగమేనని తేల్చి చెప్పారు. 1990ల నాటి పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పాలకులకు కశ్మీర్‌ను పాలించడం చేతకాదని వ్యాఖ్యానించారు. వారికి నీచ రాజకీయాలు తప్ప ఇంకేం చేతకాదంటూ మండిపడ్డారు. ఇక్కడ జరుగుతున్న హత్యలను రాజకీయం చేయడం ఆపి వాటిని నిలువరించే చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. ఇందుకోసం కేంద్రం చేపట్టబోయే చర్యలను ప్రజల ముందుంచాలన్నారు. కశ్మీర్ వెలుపల పని చేయలేమని పండిట్లతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, వారికి తగిన భద్రత కల్పించాలని డిమాండు చేశారు. ఈ ర్యాలీలో ఆప్ నేత, దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్, ఎంపీ సంజయ్ సింగ్, పలువురు ఎమ్మెల్యేలు సైతం పాల్గొని ప్రసంగించారు.

బీజేపీవి ద్వంద్వ విధానాలు

కాంగ్రెస్ రహిత భారత్ అంటూ పిలుపునిచ్చిన బీజేపీ అందుకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ నేతలను తమలో కలుపుకుంటూ కాంగ్రెస్ సహిత బీజేపీగా మారుతోందని పంజాబ్ ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మల్వీందర్ సింగ్ కాంగ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన నలుగురు కాంగ్రెస్ సీనియర్ నేతలను బీజేపీలోకి చేర్చుకుని ద్వంద్వ విధానాలను అవలింబిస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ పార్టీ స్వతహాగా నేతలను తయారు చేసుకోలేని నిస్సహాయత ఇక్కడ బయటపడిందని వ్యాఖ్యానించారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి సంబందించిన చెత్తను తమ పార్టీలోకి తీసుకుంటోందని పేర్కొన్నారు. అన్ని చోట్ల వివిధ పార్టీలు తిరస్కరించిన నేతలను ఇదే తరహాలో బీజేపీ తమ పార్టీలో చేర్చుకుంటున్న వైనాన్ని ప్రస్తావిస్తూ ఇదేనా బీజేపీ రాజకీయ సిద్ధాంతమని నిలదీశారు.

ఆధునిక కాలానికీ కబీర్ బోధనలు అవసరమే: రాష్ట్రపతి

శాంత్ కబీర్‌నగర్ (ఉత్తరప్రదేశ్): రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఆదివారం శాంత్ కబీర్ నగర్‌లో సంత్ కబీర్ అకాడమీ, పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించి, ఆధ్యాత్మిక కవి, సాధువు జీవితం మానవ ధర్మానికి నిలువెత్తు నిదర్శనమని, ఆయన బోధనలు ఆధునిక కాలానికీ అవసరమేనన్నారు. గోరఖ్‌పూర్ నుంచి శాంత్ కబీర్‌నగర్ చేరుకున్న రాష్ట్రపతి మఘర్‌లోని కబీర్ సమాధి స్థల్‌లో భక్తి ఉద్యమ సాధువుకు నివాళులర్పించారు. కబీర్ చౌరా ధామ్ ప్రాంగణంలో ఒక మొక్కను నాటాడు. 'కబీర్ జీవితం మానవ ధర్మం యొక్క సారాంశం. ఆయన బోధనలు 650 సంవత్సరాల తర్వాత కూడా నేటికీ అవసరమేనన్నారు. కబీర్ జీవితం మత సంఘీభావానికి ఆదర్శవంతమైన ఉదాహరణ" అని కోవింద్ తన ప్రసంగంలో తెలిపారు. 'అణగారిన వారి పట్ల ఆప్యాయతతో కూడిన దృక్పథంతో మాత్రమే మానవాళికి సేవ చేయవచ్చని కబీర్ ఉద్ఘాటించారు. ఆయన అధికారిక విద్యను పొందలేదు, సాధువుల సహవాసంలో తన అనుభవాల ద్వారా జ్ఞానాన్ని పొందాడు. ఆయన బోధనలు విచ్ఛిన్నమైన సమాజం యొక్క మనస్సాక్షిని కదిలించాయి." అని రాష్ట్రపతి అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. సీఎం ఆదిత్యనాథ్‌కు రాష్ట్రపతి 50వ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి ఉత్తరప్రదేశ్ పర్యటనలో చివరి రోజైన సోమవారం లక్నోలో రాష్ట్ర శాసనసభ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తారు.

'పీపీఈ కిట్ల స్కామ్' కనిపించట్లేదా!

- అధికార బీజేపీని నిలదీసిన ప్రతిపక్షాలు
- దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్

గువహటి: కరోనా సంక్షోభ సమయంలో తన భార్య, కుటుంబసభ్యులకు చెందిన ఫార్మా, హెల్త్‌కేర్ కంపెనీలకు లబ్ధి చేకూర్చే విధంగా అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదమయ్యాయి. పీపీఈ కిట్ల తయారీలో ఏ మాత్రం అనుభవం లేనప్పటికీ ఆ కాంట్రాక్టులను అప్పనంగా ఈ కంపెనీలకు కట్టబెట్టారు. ఆయా కంపెనీలు ఈ కాంట్రాక్టులను సకాలంలో, నిబంధనల మేరకు పూర్తి చేయలేదు. అయినప్పటికీ, తదుపరి టెండర్లలోనూ ఈ కంపెనీలనే అసోం ప్రభుత్వం ఎంపిక చేసుకున్నది. 2020లో జరిగిన ఈ కుంభకోణం సమాచార హక్కు చట్టం ద్వారా ఇటీవల బయటపడింది. కుంభకోణం చోటుచేసుకున్నప్పుడు విశ్వశర్మ ఆరోగ్యమంత్రిగా ఉన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలే లక్ష్యంగా సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించే బీజేపీ పెద్దలు ఈ అవినీతిపై ఎందుకు నోరు మెదపడంలేదని ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. దిల్లీలో ఎప్పుడో ఏడేండ్ల కిందటి కేసును తిరగదోడి అమ్‌ఆద్మీపార్టీ (ఆప్) మంత్రి సత్యేందర్ జైన్‌ను ఆగమేఘాలపై ఇటీవల అరెస్టు చేసిన ఈడీ.. 'పీపీఈ కిట్ల' కుంభకోణంలో విశ్వశర్మపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని నిలదీశాయి. విశ్వశర్మ భార్యకు చెందిన కంపెనీకి కరోనా లాక్‌డౌన్‌కు ముందు రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా పీపీఈ కిట్ల ఆర్డర్ ఇవ్వడంపై కేంద్ర సంస్థలతో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశాయి. ఈ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించి ప్రధాని మోదీ నిజాయితీ చాటుకోవాలని సవాల్ విసిరాయి.

మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు పీపీఈ కిట్లను కోట్ చేసిన బంధువుల కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా విశ్వశర్మ ప్రవర్తించారని ఆప్ నేత, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా విమర్శించారు. 'తప్పు చేసిన సొంత పార్టీ నేతపై చర్యలు తీసుకొనే దమ్ము బీజేపీకి ఉన్నదా? లేదా, ఎప్పటిలాగే ప్రతిపక్ష నేతలపై కేసులు బనాయిస్తూ కేంద్రప్రభుత్వం వేధింపులను కొనసాగిస్తుందా? అని ప్రశ్నించారు. 'విపక్ష నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, అవినీతి గురించి మాట్లాడే బీజేపీ నేతలకు ఈ కుంభకోణం అవినీతిగా కనిపించడంలేదా? ఈ విషయంపై ఆ పార్టీ నేతలు ఎందుకు మౌనం వహిస్తున్నారు?' అని సిసోడియా నిలదీశారు.

ఒడిశాలో కొలువు తీరిన కొత్త ప్రభుత్వం

భువనేశ్వర్: ఒడిశా ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాలతో మంత్రులంతా శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేయడంతో ఆదివారం కొత్త కేబినెట్ కొలువుదీరింది. మొత్తం 21 మంది కొత్త మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో 13 మంది కేబినెట్ ర్యాంకు హోదా కలిగిన మంత్రులు కాగా, 8 మంది సహాయ మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. రాజీనామా చేసిన పాత మంత్రుల్లో 9 మందిని మళ్లీ తన కేబినెట్‌లోకి నవీన్ పట్నాయక్ తీసుకోవడం గమనార్హం. 11 మందిని రాజీనామాలకే పరిమితం చేశారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా 'మిషన్-2024'ను దృష్టిలో ఉంచుకుని నవీన్ పట్నాయక్ మంత్రివర్గాన్ని పునరువ్యవస్థీకరించారు. ఆరోసారి కూడా 'బిజు జనతా దళ్' పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు నవీన్ పట్నాయక్ ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. కొత్త కేబినెట్‌లోకి ఆయన తీసుకున్న మంత్రుల జాబితాను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. కులం, మతం, యువత, అనుభవం ఉన్న మంత్రుల కలయికతో, సామాజిక సమీకరణాలతో కొత్త కేబినెట్‌ను నవీన్ పట్నాయక్ పట్టాలెక్కించారు. గతంలో ఇద్దరు మహిళా మంత్రులు ఆయన కేబినెట్‌లో ఉంటే తాజాగా ఐదుగురు మహిళలకు మంత్రులుగా అవకాశమిచ్చారు. గత మంత్రివర్గంలో సహాయ మంత్రులుగా ఉన్న జగన్నాథ్ సరక, అశోక్ చంద్ర పాండాకు ఈసారి కేబినెట్ ర్యాంకు మంత్రులుగా పదోన్నతి లభించింది. అంతకుముందు కొత్త మంత్రివర్గం సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నందున ఒడిశా అసెంబ్లీ స్పీకర్ ఎస్ ఎన్ పాత్రో తన పదవికి రాజీనామా చేసినట్లు అధికారి ఒకరు తెలిపారు. పట్నాయక్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వంలోని 20 మంది మంత్రులు శనివారం తమ రాజీనామా లేఖలను సమర్పించారు. పాత్రో తన చర్యకు కారణం లేదని పేర్కొంటూడిప్యూటీ స్పీకర్ ఆర్‌కే సింగ్‌కు రాజీనామా సమర్పించారు. పాత్రో కుమారుడు బిప్లాబ్ మాట్లాడుతూ, "నా తండ్రి తీవ్రమైన మూత్రపిండ వ్యాధితో, ఎడమ కంటికి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. ఆయన ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తన పదవికి రాజీనామా చేశారు. శస్త్రచికిత్సకు వెళ్లనున్నందున ప్రభుత్వ బాధ్యతలు స్వీకరించడానికి నిరాకరించారని ఆయన కుమారుడు తెలిపారు. మంత్రి పదవికి రాజీనామా చేసిన బీకే అరుఖా అసెంబ్లీ తదుపరి స్పీకర్‌గా ఎంపికయ్యే అవకాశం ఉందని అధికార బీజేడీ వర్గాలు తెలిపాయి.

మంత్రులు... వారి శాఖలు..

ఇక ప్రమాణ స్వీకారం చేస్తున్న కొన్ని గంటల్లోనే మంత్రులకు శాఖలు కేటాయించారు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్. హోం, సాధారణ పరిపాలన, పింఛన్లు, ప్రజా ఫిర్యాదులను శాఖలను సీఎం నవీన్ తన వద్దే ఉంచుకున్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, మైనార్టీ బ్లాక్ వార్డ్ క్లాసెస్ వెల్ఫేర్‌లతో పాటు న్యాయశాఖను జగన్నాథ్ సరకాకు అప్పజెప్పగా, నిరజంన్ పుజారీ తిరిగి ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. కుమార్ మాలిక్‌కు స్టీల్, మైన్స్ శాఖ అప్పగించగా, ఎన్‌కే దాస్‌కు ఆరోగ్య, కుటుంబ శాఖను, అశోక్ చంద్ర పాండాకు సైన్స్ & టెక్నాలజీ శాఖలను అప్పజెప్పారు. టీకే బెహరాకు క్రీడా శాఖతో పాటు, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను కూడా అప్పగించారు. వ్యవసాయ శాఖామంత్రిగా ఆర్పీ స్వైన్, మాజీ ఆరోగ్యశాఖ మంత్రి ఎస్ నాయక్‌కు ఫుడ్స్ సప్లయిస్, కన్సుమర్ వెల్ఫేచనెర్‌లతో పాటు కారొపరేషన్ శాఖను, పీకే దేబ్‌కు ఇండస్ట్రీస్, మైక్రో, స్మాల్ & మీడియం ఎంటర్‌ప్రైజెస్, ఎనర్జీ శాఖలను అప్పగించారు. ప్రమీలా మాలిక్‌కు రెవెన్యూ, డిజాస్టర్ శాఖ, ఉషాదేవికి హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ, తుకానీ సాహుకు వాటర్ రిసోర్సెస్ & కామర్స్, ట్రాన్స్‌పోర్టు శాఖలను కేటాయించారు. రోహిత్ పుజారీకి విద్యాశాఖ, సమీర్ రంజన్ దాష్‌కు స్కూల్ & మాస్ ఎడ్యుకేషన్ శాఖ అప్పగించారు. అశ్వినీకుమార్ పాత్రకు టూరిజం శాఖను కేటాయించారు.

నిలువెత్తు నిరాడంబరుడు

సి.ఆర్. చివరి లేఖ

1. డాక్టర్లు సర్వశక్తులు ఒడ్డి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ నేను ఇక జీవించలేను. నాకెలాంటి విచారం లేదు. ప్రయోజనకరమైన సంపూర్ణ జీవితాన్ని గడిపాను.
2. నాకు సేవలు చేసిన సిబ్బందికి,పార్టీసభ్యులకు కృతజ్ఞతలు.
3. నాభౌతికకాయానికి హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు జరపాలి. నాభౌతికకాయాన్ని ఎక్కడికి తీసుకొని వెళ్లరాదు.
4. నాకు ఆస్తిపాస్తులు లేవు.నేను ఎవ్వరికి ఏమీ యివ్వవలసిన అవసరంలేదు.ఎవరినుండీనేను ఏమీతీసుకోలేదు పుస్తకాలు పార్టీకి,దుస్తులు అవసరమైనవారికి
5. అందరికీ కృతజ్ఞతలు.

సి.రాజేశ్వరరావు
6-11-1993

ఆర్వీ రామారావ్

ఆస్తి పాస్తులు దండిగా సంపాదించిన వారు తమ జీవిత చరమాంకంలో వీలునామా రాస్తూ ఉంటారు. స్థితిమంతులు వీలునామా రాయకుండా మరణిస్తే తరవాత వాటి పంపకాలలో వివాదాలు తలెత్తకుండా వీలునామాలు ఉపకరిస్తాయి. కానీ అసలే ఆస్తిపాస్తులు, డబ్బు వెనకేసుకోని వారికి వీలునామా రాసే అవసరం ఏమిటో తెలియదు. కానీ కమ్యూనిస్టు అగ్ర నాయకుడు చంద్ర రాజేశ్వరరావు వీలునామా రాసి వెళ్లారు. అందులో సారాంశం ఏమిటంటే తన దగ్గర నగదు గానీ, బ్యాంకు బ్యాలెన్సు గానీ ఏమీ లేదు. కానీ దుస్తులు పేదవారికి, పుస్తకాలు కమ్యూనిస్టు పార్టీకి ఇచ్చేయాలి అని రాశారు.

చంద్ర రాజేశ్వర రావు పేదింట ఏమీ పుట్టలేదు. కృష్ణా జిల్లా మంగళాపురంలో చెప్పుకోదగిన భూవసతి ఉన్న ఇంట్లోనే పుట్టారు. కానీ కమ్యూనిస్టు పార్టీలో చేరిన తొలి దశలోనే తన ఆస్తి అంతా అమ్మేసి పార్టీకి ఇచ్చేశారు. తరవాత ఆయనకు సంపాదన ఏమీ లేదు కనక మిగిల్చే అవకాశమే రాలేదు. ఆయన తన దుస్తులు పేదలకు ఇచ్చేయాలన్నారు. ఆయన ఆరడుగుల మనిషి. దిట్టమైన విగ్రహం. ఆ దుస్తులు వేసుకోగలిగిన వారిని వెతికి పట్టుకోవాల్సిందే. అలాంటి వ్యక్తి నాకు తెలియడం గొప్ప కాదు. కానీ నేను ఆయనకు తెలియడం నాకు గర్వకారణమే. ఆయన హైదరాబాద్ వచ్చినప్పుడల్లా మఖ్దూం భవన్ లో కలుసుకునే వాణ్ని. తారతమ్యాలతో నిమిత్తం లేకుండా ఆయన మనుషులను గుర్తు పెట్టుకునే వారు. ఎప్పుడైనా ఆయన హైదరాబాద్ వచ్చి నాలుగు రోజులు ఉన్నా నా బోటివాడు కనిపించకపోతే "ఏడీ కనబడడం లేదు" అనే వారు. ఆయన చిన్నా పెద్దా తేడా లేకుండా కొన్ని వేలమందిని పేరు పేరునా గుర్తుపెట్టుకునే వారు. మానవ సంబంధాలకు విలువ ఇచ్చినందువల్లే ఆయన అగ్రశ్రేణి పార్టీ నాయకుడై ఉంటారు. ఆయన నిరాడంబరత నటన కాదు. చెప్పింది ఆచరించేతత్వం ఉన్న వారు. ఒక్క ఉదాహరణ: 1992 ఏప్రిల్ 10 నుంచి 16 దాకా హైదరాబాద్‌లో కమ్యూనిస్టు పార్టీ 15వ మహాసభ జరిగింది. ఆ మహాసభలోనే ఆయన ప్రధాన కార్యదర్శి బాధ్యతలనుంచి తప్పుకున్నారు. ఇంద్రజిత్ గుప్తా సీపీఐ ప్రధాన కార్యదర్శి అయ్యారు. మధ్యాహ్నం భోజనాల సమయంలో నేను ఆ మహాసభ జరిగే చోటికి వెళ్లి తెలిసిన వాళ్లను పలకరించేవాడిని. భోజనాలకు వెళ్లే వారందరూ


1961లో విజయవాడలో జరిగిన 6వ పార్టీ మహాసభలకు వచ్చిన కామ్రేడ్స్ పి.సి.జోషి, అజయకుమార్ ఘోష్, ఎస్.ఎ.ఘాటెకు రైల్వేస్టేషన్‌లో స్వాగతం చెబుతున్న సి.ఆర్.

6వ తేదీ సోమవారం
కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు
108వ జయంతి సందర్భంగా

బారులు తీరినిలబడ్డారు. ఇంద్రజిత్ గుప్తా, నీలం రాజశేఖరరెడ్డి కూడా భోజనానికి వెళ్లడానికి సన్నద్ధమయ్యారు. వరుసలో నిలబడ్డ వారు వీరిని చూసి మధ్యలో దూరాలని కోరారు. వారు ఆ ప్రయత్నం చేశారు. నడుం మీద చేతులు పెట్టుకుని దూరంగా నిలబడ్డ భారీ విగ్రహం గట్టిగా "ఇంద్రజిత్" అని పిలవడం వినిపించింది. నిలుచున్న చోటి నుంచే క్యూలో వెళ్లాలని సైగ చేశారు. అంతే ఇంద్రజిత్, నీలం రాజశేఖరరెడ్డి పంక్తి చివరకు వెళ్లి పోయారు. నాయకులు అధికులు కాదని నమ్మడమే కాక ఆచరించిన మనిషి చంద్ర. ఏ పార్టీకైనా అగ్రనాయక స్థాయికి చేరాలంటే విస్తారమైన అనుభవం దానికి తగ్గ వయసు ఉండాలి. 1950-1951లో చంద్ర రాజేశ్వరరావు సీపీఐ ప్రధాన కార్యదర్శి అయ్యారు. అప్పటికి ఆయనకు 36 ఏళ్లు. అంతకన్నా ఏడాది తక్కువ వయసులో 35 ఏళ్లకే కాంగ్రెస్ అధ్యక్షులు అయింది అబుల్ కలాం ఆజాద్.

పదవి దొరికితే వదలకుండా తమది భల్లూకపు పట్టు అని నిరూపించే వారికి ఏ పార్టీలోనూ కొదవలేదు. కానీ చంద్ర 1964 నుంచి 1990 దాకా సుదీర్ఘ కాలం సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నా ఆరోగ్యం సహకరించడం లేదనుకున్నప్పుడు స్వచ్ఛందంగా తప్పుకున్నారు. చంద్ర బెనారస్‌లో సైన్సు చదివారు. కానీ ఆ తరవాత విశాఖపట్నం వచ్చి వైద్య విద్యలో చేరారు. అదీ పూర్తి చేయకుండా వదిలేసి పార్టీకి అంకితమై పోయారు. కానీ ఆయనకు సైన్సు మీద విపరీతమైన ఆసక్తి. ఒకసారి ఢిల్లీలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏదో జరిగితే చంద్ర వెళ్లారు. ఆయన ఒక చోట నిలబడి పరిశీలనగా చూస్తున్నారు. అక్కడ ఉన్న కార్యకర్త ముందుకు కదలాలని అన్నారు. అ ప్రదర్శించిన వాటిలో ఓ లోపం సీఆర్‌కు కనిపించింది. అదే విషయం ఆ కార్యకర్తను అడిగారు. అవాక్కైపోవడం ఆ కార్యకర్త వంతైయింది. దేన్నైనా ఆయన నిశితంగా అధ్యయనం చేసే వారనడానికి ఇది ఒక తార్కాణం.

కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన డాంగే అల్లుడు బానీ దేశ్ పాండే "యూనివర్స్ ఆఫ్ వేదాంత" అని ఓ పుస్తకం రాశారు. దానికి డాంగే దాదాపు 40 పేజీల పీఠిక రాశారు. డాంగే వ్యక్తం చేసిన అభిప్రాయాలపై దుమారం రేగింది. వివిధ భాషల్లోని పార్టీ పత్రికలలో చర్చోప చర్చలు జరిగాయి. దీన్ని ఒక కొలిక్కి తేవడం కోసం చంద్ర జోక్యం చేసుకుని ఢిల్లీలో దాదాపు 90 మందితో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. అందులో తెలుగువాళ్లు ఇద్దరే పాల్గొన్నారు. వారు ఏటుకూరి బలరామ మూర్తి, రాంభట్ల కృష్ణమూర్తి. సైద్ధాంతిక గందరగోళానికి తావివ్వకూడదని సీఆర్ భావించే వారు. ఆ సందర్భంలోనే ఒక సారి ఆయన హైదరాబాద్ వస్తే రాంభట్ల, నేను మఖ్దూం భవన్ లో కలిశాం. చర్చ డాంగే పీఠిక మీదకు మళ్లింది. రాంభట్ల ఏదో చెప్తున్నారు. నేను మధ్యలో కల్పించుకుని పతంజలి యోగ శాస్త్రంలో ఇలా ఉంది అని తెలిసో తెలియకో మాట్లాడాను. ఆ పుస్తకం నీ దగ్గర ఉందా అని సీఆర్ అడిగారు. ఉందన్నాను. అయితే రేపు తీసుకురా, నేను మళ్లీ వచ్చినప్పుడు తీసుకుందువుగానీ అన్నారు. మర్నాడు పట్టుకెళ్లి ఇచ్చా. కొన్నాళ్ల తరవాత హైదరాబాద్ వచ్చినప్పుడు "ఆ పుస్తకం మార్కెట్లో దొరుకుతుందా?" అని అడిగితే దొరుకుతుంది అన్నాను. "అయితే నువ్వు మరొకటి కొనుక్కో" అన్నారు. ఆయన ఆసక్తి అంత లోతైంది. తెలంగాణలో ఆంధ్ర మహాసభ నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరిస్తున్నప్పుడు ఎనిమిదవ మహాసభకు సీఆర్ హాజరయ్యారు. కానీ పరిశీలక పాత్రే పోషించారు. పదకొండవ మహాసభలో మాత్రం ఆంధ్ర ప్రాంతం నుంచి సీఆర్ నాయకత్వంలో ఓ ప్రతినిధివర్గం వచ్చింది. ఆ తరువాతే ఆంధ్ర మహాసభలో సీఆర్ పాత్ర ప్రత్యక్షంగా కనిపించింది. నిజాం గద్దె దిగిన తరువాత కొన్నాళ్లకు సాయుధ పోరాటం విరమించాలని సీపీఐ నిర్ణయానికి వచ్చింది. అజ్ఞాత వాసంలో ఉన్న దళాలకు సాయుధ పోరాటం ఎందుకు విరమించాలో విడమర్చడానికి సీఆర్ అడవుల్లో మారుమూల ప్రాంతాలకూ వెళ్లారు.

నిజాయితీ, నిర్భీకత, నిరాడంబరత సీఆర్‌కు తెచ్చిపెట్టుకున్న అలంకారాలు కావు. అవి ఆయన స్వభావంలో భాగం. పీపుల్స్‌వార్ గ్రూపు అగ్రనాయకుడు కొండపల్లి సీతారామయ్యకు సీఆర్ వ్యక్తిత్వం మీద అపారమైన గౌరవం. అందుకే జైలు నుంచి విడుదలైన వెంటనే సీతారామయ్య మఖ్దూం భవన్ వెళ్లి అనారోగ్యంతో ఉన్న సీఆర్ ను పరామర్శించారు. కొండపల్లి కోటేశ్వరమ్మ ఆత్మకథ "నిర్జన వారధి" చదివితే సీఆర్ వ్యక్తిత్వంలో ఆర్ద్రత ఎంత ప్రస్ఫుటంగా ఉంటుందో అర్థం అవుతుంది. రాజకీయ విభేదాలు ఆయన మానవ సంబంధాలకు ఎన్నడూ అడ్డు రాలేదు. 1986లో అనుకుంటా భారీ వర్షాలకు నిడదవోలు జంక్షన్ కొట్టుకుపోయింది. సకల విధరాకపోకలకూ అంతరాయం కల్గింది. అప్పుడు సీ.ఆర్. విశాఖపట్నంలో చిక్కుకు పోయారు. ఆయన అనేక గ్రామాలకు వెళ్లి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. అధికారుల బృందాలు చేరుకోని అనేక గ్రామాలను సీఆర్ సందర్శించారు. జనం ఎక్కడ ఉంటే అక్కడ సీఆర్ ఉండేవారు. నిలువెత్తు నిరాడంబరుడాయన.

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

నవ సంకల్ప సదస్సులో కాంగ్రెస్ నేతలు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: దేశం పురోగాభివృద్ధి చెందాలంటే ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. ప్రస్తుతం దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని, దీనికి చరమగీతం పాడాలంటే 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఆదివారం కడపలో జరిగిన రెండోరోజు నవ సంకల్ప సదస్సులో కాంగ్రెస్ పార్టీ జాతీయ నేతలు కొప్పుల రాజు, జేడీ శీలం, శైలజానాథ్, తులసిరెడ్డి, మస్తాన్ వలి, మెయ్యప్పన్, క్రిస్టఫర్ తిలక్, గిడుగు రుద్రరాజు తదితర నేతలు ప్రసంగించారు. ప్రస్తుతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజలను మానసిక సంక్షోభానికి గురిచేస్తూ ద్వంద్వనీతిని చాటుకుంటున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే శైలజానాథ్ మాట్లాడుతూ ఎన్నికల కోసమే పార్టీ పెట్టుకున్నారా? రాష్ట్రంలో ఆకలి కేకలు వినిపిస్తుంటే వాటి గురించి ఎందుకు ప్రస్తావించరని, ఆకలి కేకలు ఎలా తీర్చాలో ఎందుకు ఆలోచించరని ప్రశ్నించారు. పాచిపోయిన లడ్డుతో ప్రారంభమైన పవన్ ప్రస్థానం బీజేపీతో అంటకాగే పరిస్థితి వరకూ వచ్చిందన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం విభజన హామీల్లో ఒక్కటైనా అమలు చేసిందా అని ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్ విభజన హామీల అమలు కోసం ఏనాడైనా కేంద్రాన్ని ప్రశ్నించారా? అని నిలదీశారు. జేడీ శీలం మాట్లాడుతూ ఆర్థిక పురోభివృద్ధి సాధించాలంటే ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పన మెరుగు పడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై చురకలంటించారు. జనసేన పవన్ కల్యాణ్ పార్టీ పొత్తుల గురించి మాట్లాడే అధికారం ఆయనకు ఉంటుందని ఆయన ఎప్పుడు ఎవరితో అయినా పొత్తు పెట్టుకోవచ్చని 2014 ఎన్నికల్లో టీడీపీ బీజేపీతో కలిసి ఎన్నికలకు వెళ్లాడన్నారు. ఆంధ్రప్రదేశ్ కు పాచిపోయిన లడ్లు ఇచ్చారని విమర్శించిన పవన్, నేడు అదే బీజేపీతో పొత్తులో ఉన్నాడని విమర్శించారు. బద్వేలు ఉప ఎన్నికల్లో పవన్ బీజేపీకి మద్దతిచ్చారని ఇప్పుడేమో టీడీపీతో కూడా పొత్తు అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. పవన్‌ని విమర్శించేంత స్థాయి, మెచ్యూరిటీ తనకు లేదంటూ చురకలంటించారు.

భవిష్యత్ తరాలకు 'నల్లూరి' ఆదర్శనీయుడు

'నేను నడిచిన బాట' పుస్తకావిష్కరణలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: సంపూర్ణమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయులని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ కొనియాడారు. నల్లూరి వెంకటేశ్వర్లు రచించిన 'నేను నడిచిన బాట' పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం మల్లయ్య లింగం భవనంలో నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి ఎస్‌డి సర్దార్ అధ్యక్షతనజరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా అందరి మన్ననలు పొందిన వ్యక్తి నల్లూరి వెంకటేశ్వర్లు అని తెలిపారు. నల్లూరి తనను సీపీఐలోకి తీసుకొచ్చారని, ఆయన రచించిన పుస్తకాన్ని నా చేతుల మీదుగా ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని నారాయణ తెలిపారు. 72ఏళ్ల రాజకీయ జీవితంలో ఆయన అనుభవాలను పుస్తక రూపంలో తీసుకురావడం భావితరాలకు అవసరమన్నారు. రౌడీలు, గూండాలు, అరాచకవాదుల చరిత్ర పుస్తకరూపంలో వస్తున్నాయని ఆ పుస్తకాలు సమాజానికి అవసరం లేదని అన్నారు. నిరాడంబర జీవితాన్ని గడుపుతూ అన్ని రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని ఎంతోమందిని కమ్యూనిస్టు పార్టీలోకి, సాంస్కృతిక రంగంలోకి ఆహ్వానించి తీర్చిదిద్దిన నల్లూరి ఆదర్శప్రాయుడన్నారు. 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిక ముందు, తర్వాత కమ్యూనిస్టు పార్టీ బలం, బలహీనతల గురించి అన్న పుస్తకంలో క్షుణ్ణంగా వివరించారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ఎక్కడ ఉందని హేళన చేసే వారు... కమ్యూనిస్టు పార్టీ పేద, బడుగు, బలహీన వర్గాల గుండెల్లో ఉందని తెలుసుకోవాలన్నారు. నాగార్జున యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎస్.అంజయ్య మాట్లాడుతూ ... సాంస్కృతిక, రాజకీయ ఉద్యమం అనుభవాన్ని అభ్యుదయ ఆలోచనలవైపు నడిపించిన నల్లూరి వెంకటేశ్వర్లు జీవితపయనం పుస్తకరూపంలో రావడం గర్వకారణమన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ... నల్లూరి వెంకటేశ్వర్లు సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఆయనతో కలిసి జిల్లా సహాయ కార్యదర్శిగా పనిచేయడం అదృష్టంగా భావించానని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ... ప్రకాశం జిల్లా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర తెలుసుకోవాలంటే నల్లూరి వెంకటేశ్వర్లు రచించిన నేను నడిచిన బాట పుస్తకాన్ని చదివితే చాలునని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఇదొక గ్రంథంగా నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకుడు స్టాలిన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య పాల్గొన్నారు. అనంతరం పుస్తకాన్ని రచించిన నల్లూరి వెంకటేశ్వర్లుకు నారాయణ చేతుల మీదుగా చిరుసత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా తన పుస్తక రచనకు సహకరించిన ప్రతి ఒక్కరికి అన్న నల్లూరి వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి: మోదీ

న్యూఢిల్లీ: భారతదేశం నిర్ణీత గడువు కంటే ముందే పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ కలపాలనే లక్ష్యాన్ని సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అన్నారు. ఇక్కడ విజ్ఞాన్ భవన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జరిగిన 'సేవ్ సాయిల్ మూవ్ మెంట్' కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ పర్యావర ణాన్ని పరిరక్షించడానికి తన ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలను ఉదహరించారు. వాతావరణ మార్పులో దేశం అతి తక్కువ పాత్రను కలిగి ఉన్నప్పటికీ దాని ప్రయ త్నాలు బహు కోణాలలో ఉన్నాయని తెలిపారు. 2014లో పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం రెండు శాతం నుంచి 10 శాతానికి పెరగడం వల్ల ఇప్పుడు 27 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించి రూ.41,000 కోట్ల విదేశీ నగదు నిల్వలు ఆదా అయ్యాయని, దీనివల్ల రైతులకు రూ.40 వేల కోట్ల ఆదాయం వచ్చిందని అన్నారు. తన ప్రసంగంలో భారతదేశం తన స్థాపిత విద్యుదుత్పత్తిలో 40 శాతం నాన్-ఫాసిల్ ఇంధన ఆధారిత వనరుల నుంచి గడువుకు తొమ్మిదేళ్ల ముందే లక్ష్యాన్ని కూడా సాధించిందని ప్రధాని చెప్పారు. నేల ఆరోగ్యం క్షీణించడంపై అవగాహన పెంచడానికి, దానిని మెరుగుపరచడానికి చేతన ప్రతిస్పందనను తీసుకురావ డానికి సేవ్ సాయిల్ మూవ్‌మెంట్ అనేది ప్రపంచవ్యాప్త చొరవ అని ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఉద్యమాన్ని మార్చి 2022లో సద్గురు ప్రారంభించారు. వీరు 100 రోజుల మోటార్ సైకిల్ ప్రయాణాన్ని 27 దేశాల గుండా ప్రారంభించారు. జూన్ 5 నాటికి 100 రోజుల ప్రయాణంలో 75వ రోజుకు చేరుకుంది. ప్రధాని మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లలో భారతదేశంలో అటవీ విస్తీర్ణం 20 వేల చదరపు కిలోమీటర్ల మేర పెరిగిందని, వన్య ప్రాణుల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో వృద్ధి చెందిందని అన్నారు.

ఐఫా2022 అవార్డులు.. ఉత్తమ నటుడు విక్కీ కౌశల్

అబుదాబి: నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా నటించిన యుద్ధ నేపథ్య చిత్రం "షేర్షా" శనివారం జరిగిన ఐఐఎఫ్ఏ అవార్డ్సులో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈ చిత్రంలోని నటులు విక్కీ కౌశల్, కృతి సనన్ హోమ్ యాక్టింగ్ ట్రోఫీలను తీసుకున్నారు. అబుదాబిలోని యాస్ ద్వీపంలోని యాస్ బే వాటర్‌ఫ్రంట్‌లో భాగమైన ఎతిహాద్ అరేనాలో మూడు రోజుల కోలాహలం జరిగిన ఐఫా2022 వేడుక ఘనంగా ముగిసింది. కరణ్ జోహార్ నిర్మించిన "షేర్షా" విష్ణువర్ధన్‌కు ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకత్వం అవార్డును గెలుచుకుంది. కార్గిల్ యుద్ధ వీరుడు కెప్టెన్ విక్రమ్ బాత్రా జీవితం ఆధారంగా రూపొందించబడిన ఈ చిత్రం సంగీత విభాగంలో కూడా అవార్డులను గెలుచుకుంది, ఉత్తమ గాయకుడిగా రాతన్ లంబియన్, గాయనిగా జుబిన్ నౌటియాల్‌లకు అవార్డులు లభించాయి. ఉత్తమ సంగీత దర్శకత్వ గౌరవం ఏఆర్ రెహమాన్ రచించిన "అత్రంగి రే" మరియు తనిష్క్ బాగ్చి, జస్లీన్ రాయల్, జావేద్-మొహ్సిన్, విక్రమ్ మాంట్రోస్, బి ప్రాక్, జానీ రచించిన "షేర్షా" మధ్య టైను సాధించింది. అనురాగ్ బసు తన ప్రశంసలు పొందిన 2020 విడుదలైన "లూడో" కోసం ఉత్తమ ఒరిజినల్ స్టోరీ అవార్డును అందుకున్నాడు. కోవిడ్ కారణంగా గత సంవత్సరం మరణించిన చిత్ర ఎడిటర్ అజయ్ శర్మకు విజయాన్ని అంకితం చేశాడు. కబీర్ ఖాన్, సంజయ్ పురాణ్ సింగ్ చౌహాన్‌లు 1983 క్రికెట్ ప్రపంచ కప్ విజయం ఆధారంగా రూపొందించిన "83" చిత్రానికి గానూ ఉత్తమ కథనం అవార్డు స్వీకరించారు. "సర్దార్ ఉద్ధం"లో స్వాతంత్ర్య సమరయోధుడు ఉధమ్ సింగ్ పాత్రకు విక్కీ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యాడు. షూజిత్ సిర్కార్ దర్శకత్వం వహించిన ప్రైమ్ వీడియోలో గత సంవత్సరం ప్రశంసలు అందుకుంది. విక్కీ తన కుటుంబానికి, భార్య కత్రినా కైఫ్, సిర్కార్ మరియు నిర్మాత రోనీ లాహిరికి కృతజ్ఞతలు తెలిపారు. "ఇది నా మొదటి ఉత్తమ నటుడి అవార్డు. నా జీవితమంతా నేను మెచ్చుకున్న, గౌరవించే నటుడికి అంకితమివ్వాలనుకుంటున్నాను. మేము అతనిని చాలా త్వరగా కోల్పోయాం. సర్దార్ ఉదం, దివంగత ప్రియమైన ఇర్ఫాన్ సాహబ్ పాత్ర పోషించడం అసలు ఎంపిక అని విక్కీ చెప్పారు. 'మిమి'లో తన నటనకు గానూ నటి కృతి సనన్‌కు ఉత్తమ నటి అవార్డు లభించింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన కామెడీ-డ్రామా చిత్రమిది. ఇందులో సహాయక పాత్రలో ఉత్తమ నటనకు సాయి తమహంకర్ కూడా ఉన్నారు. "లూడో" చిత్రానికి గాను పంకజ్ త్రిపాఠి ఉత్తమ సహాయ నటుడి అవార్డును అందుకున్నారు. నటుడు అవార్డును స్వీకరించడానికి వచ్చినప్పుడు, అతను అభిమానులచే చప్పట్లతో స్వాగతం పలికారు. 'తడప్" చిత్రానికి గాను అహన్ శెట్టి ఉత్తమ అవార్డును కైవసం చేసుకున్నారు. ఈ అవార్డును అతని నటుడు తండ్రి సునీల్ శెట్టి ఆయనకు అందజేశారు. నటి శర్వరీ వాఘ్ తన చిత్రం "బంటీ ఔర్ బబ్లీ 2" కోసం ఉత్తమ తొలి అవార్డ్‌ను కైవసం చేసుకుంది. ఈ అవార్డు వేడుకకు సల్మాన్ ఖాన్, రితీష్ దేశ్‌ముఖ్, మనీష్ పాల్ హోస్ట్‌గా వ్యవహరించారు. అభిషేక్ బచ్చన్, టైగర్ ష్రాఫ్, అనన్య పాండే, సారా అలీ ఖాన్, నోరా ఫతేహి తదితరులు ప్రదర్శనలు ఇచ్చారు. నటుడు షాహిద్ కపూర్ సంగీత స్వరకర్త, గాయకుడు బప్పి లాహిరికి ప్రత్యేక నివాళితో కార్యక్రమం ముగిసింది.

'భారత్ జోడో యాత్ర'కు కాంగ్రెస్ నేతల ప్రణాళిక

న్యూఢిల్లీ: ఉదయపూర్ 'నవ్ సంకల్ప్ శిబిర్'లో పార్టీ ప్రకటించిన 'భారత్ జోడో యాత్ర' కోసం సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రణాళికను ప్రారంభించారు. 'యాత్ర' కోసం పార్టీ కేంద్ర ప్రణాళికా బృందం మొదటి సమావేశంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న కన్యాకుమారి నుంచి 'భారత్ జోడో యాత్ర' ప్రారంభమై కశ్మీర్‌లో ముగుస్తుంది. 'భారత్ జోడో యాత్ర కోసం కేంద్ర ప్రణాళిక బృందం మొదటి సమావేశం ఈ రోజు జరిగింది. కన్యాకుమారి నుంచి కశ్మీర్ యాత్ర అక్టోబర్ 2న ప్రారంభమవుతుంది. దానికి సంబం ధించిన ప్రణాళిక చాలా తీవ్రంగా ప్రారంభమైంది. రాహుల్ గాంధీ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు' అని పార్టీ సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో జాప్యం తగదు

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులు వైద్య ఖర్చుల నిమిత్తమై చెల్లించిన సొమ్మును, రీయింబర్స్ మెంట్ ద్వారా పొందడం కోసం పెట్టిన బిల్లులను నెలల తరబడి మంజూరు చేయకుండా జాప్యం చేయడం అన్యాయమని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. కడపలోని వి.వి.ఆర్ ఎస్.టి.యు భవన్ నందు జరిగిన కడప రీజియన్ కార్యకర్తల సమా వేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కత్తి నరసింహ రెడ్డి మాట్లాడుతూ వైద్య ఖర్చుల కోసం పెట్టిన బిల్లులు కూడా దీర్ఘకాలంగా పెండింగ్ లో పెట్టడం ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నామన్నారు. నగదు రహిత చికిత్స కోసం ప్రభుత్వం ఇచ్చిన హెల్త్ కార్డులు సక్రమంగా పని చేయక, అన్ని ఆస్పత్రులు ఈ కార్డులను అనుమతించపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుచున్నారన్నారు. ప్రతి నెలా జీతం నుండి మాత్రం 225రూ, 300రూ మినహాయించి, ట్రస్టుకు జమచేస్తున్నప్పటికీ, సరైన నగదు రహిత వైద్యం అందడం లేదనే నిరాశలో ఉద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారని, హెల్త్ కార్డులు మన రాష్ట్రంతో పాటు, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, వేలూరు, తదితర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాలలో కూడా పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎయిడెడ్, గురుకులాలు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కూడా హెల్త్ కార్డులు మంజూరు చేయలన్నారు. రాష్ట్ర బాధ్యులు బాలగంగి రెడ్డి, ఇలియాస్ భాషలు మాట్లాడుతూ సి.పి.యస్ రద్దు విషయంలో ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ, త్వరలోనే ఉద్యమ కార్యాచరణ చేపట్టి, ఉద్యమిస్తామన్నారు. విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడి చేలా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:30 నుండి 1:45 కు పెంచడం అనేది విద్యా ప్రమాణాలను దెబ్బతీసే చర్య అన్నారు. ఉన్నత పాఠశాలల్లో 600మందికి ఒకే హిందీ పోస్టును కేటాయించేలా ఉన్న ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మహబూబ్ భాష, సీనియర్ నాయకులు సురేష్ బాబు, రవిశంకర్ రెడ్డి, రీజనల్ కన్వీనర్ మహబూబ్ భాష, కో-కన్వీనర్ కరీముల్లా రీజియన్ పరిధిలోని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నదిలో మునిగి ఏడుగురి యువతులు మృతి

కడలూరు: తమిళనాడులోని కడలూరు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నెల్లికుప్పం కిలరుంగుణం సమీపంలోని గెడిలం నదిలో ఏడుగురి యువతులు మునిగిపోయి మృతి చెందారు. వారంతా 18 ఏళ్ల లోపువారే. వివరాల్లోకి వెళితే... స్థానిక గ్రామాలకు చెందిన కొంతమంది యువతులు, బాలికలు ఆదివారం మధ్యాహ్నం స్నానం చేసేందుకు గెడిలం నదిలోకి దిగారు. అయితే నీటి ప్రవాహం అధికం కావడంతో సవిత(18), ప్రియ(18), సుముత(18), మోనిష(16), సంఘవి(16), ఆర్.ప్రియదర్శిని(15), ఆమె సోదరి దివ్యదర్శిని (10) నీటిలో కొట్టుకుపోయారు. అక్కడ ఉన్న వారి కేకలు విని, కొంతమంది నదిలోకి దిగి వారిని బయటకు తీశారు. వెంటనే కడలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా... అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మృతులకు సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.